ప్రజాశక్తి

బుధవారం 12 జులై 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

దద్దరిల్లిన కలెక్టరేట్లు

- విశాఖ, అనకాపల్లిల్లో భారీ స్థాయిలో అంగన్‌వాడీల ముట్టడి
- సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటాన్ని ఆపేదిలేదని హెచ్చరిక
- 650 మంది అరెస్టు
- నిర్బంధాన్ని ఖండించిన సిపిఎం, సిఐటియు



విశాఖలో అంగన్‌వాడీ కార్యకర్తను అరెస్టు చేస్తున్న పోలీసులు

తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో అంగన్‌వాడీలు మంగళవారం కలెక్టరేట్లను ముట్టడించారు. సోమవారం నుంచి 36 గంటలపాటు ధర్నాకు దిగిన వారు ఏకధాటిగా తమ సమస్యలపై నినదిస్తూనే ముందుకు కదిలారు. మంగళవారం వారికి సిపిఎం సహా పలు పార్టీల, ప్రజా సంఘాల మద్దతు లభించింది. తమ సమస్యలను చెప్పుకుందామని విశాఖ కలెక్టరేట్‌కు బయలుదేరిన అంగన్‌వాడీల్లో 650 మందిని పోలీసులు అరెస్టు చేశారు. అనకాపల్లిలోనూ తీవ్ర నిర్బంధం విధించారు. ప్రభుత్వ వైఖరిని సిపిఎం, సిఐటియు తీవ్రంగా ఖండించాయి.

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఐసిడిఎస్ బడ్జెట్ పెంచాలని, సిఎం జగన్ గతంలో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో కన్నా అదనంగా వేతనాలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు గ్రాట్యుటీ చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద 36 గంటల పాటు దీక్ష సాగించిన అంగన్వాడీలు మంగళవారం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు ర్యాలీగా బయలుదేరి వెళ్తుండగా జైలు రోడ్డు జంక్షన్ వద్ద పెద్ద ఎత్తున పోలీసులు మోహరించి అడ్డుకున్నారు. దీంతో వందలాదిగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు, వారికి మద్దతుగా ఉన్న సిఐటియు నాయకులు రోడ్డుపై బైఠాయించారు. పోలీసులు కర్కశంగా వ్యవహరించి 650 మందిని అరెస్టు చేశారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు, విశాఖ జిల్లా మిగతా 2లో..



అనకాపల్లి కలెక్టరేట్‌ను ముట్టడించిన అంగన్‌వాడీలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

ప్రాధాన్యతా రంగాలకు

విరివిగా రుణాలివ్వండి

జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్న వ్యవసాయ, ఎస్‌హెచ్‌జి బ్యాంక్ లింకేజ్, రాష్ట్ర ప్రభుత్వ పథకాలైన నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు, ఎపి టిడ్కో ఇళ్ల తదితర రంగాలకు లక్ష్యం మేరకు బ్యాంకర్లు రుణాలందించి జిల్లా ఆర్థిక ప్రగతిలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లిఖార్జున బ్యాంకర్లు, జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా రుణ ప్రణాళిక నాలుగో త్రైమాసికం అమలు, సాధించిన ప్రగతిపై బ్యాంకర్లతో డిసిసి / డిఎల్‌సిఆర్ సమావేశాన్ని జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మతో కలిసి ఆయన నిర్వహించారు. ముందుగా గత త్రైమాసిక సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను, సాధించిన ప్రగతిని లీడ్ బ్యాంకు మేనేజర్ వి.శర్మ జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొత్తం రుణ ప్రణాళికలో మిగతా 2లో..

అదానీ గంగవరం పోర్టు కార్మికుల భిక్షాటన

వార్త 4లో..

విశాఖలో సాయిధరమ్ తేజ్ సందడి

వార్త 2లో..

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సచివాలయ సెక్రటరీ

వార్త 3లో..

జివిఎంసి స్థాయీ సంఘం

ఎన్నికల బరిలో 20 మంది



ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి స్థాయీ సంఘం ఎన్నికల బరిలో 20 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ వెల్లడించారు. మంగళవారం ఆయన స్థాయీ సంఘం ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటించారు. నామినేషన్ వేసిన వారిలో శరగడం రాజశేఖర్, గంధం శ్రీనివాసరావు, గోడి విజయలక్ష్మి, పిసిని వరలక్ష్మి నరసింహం, బల్ల శ్రీనివాసరావు, పిల్లా మంగమ్మ, బొమ్మిడి రమణ, నొల్లి నూకరత్నం, ముక్కా శ్రావణి, ఉరుకూటి నారాయణరావు, కోడిగుడ్ల పూర్ణిమ, అక్కరమాని పద్మ, గుడ్ల విజయ సాయి, బల్లా లక్ష్మణరావు, పీలా లక్ష్మీ సౌజన్య, భూపతిరాజు సుజాత, కంటిపాము కామేశ్వరి, బట్టు సూర్యకుమారి, చల్లా రజిని, మద్దెల రామలక్ష్మి ఉన్నారన్నారు. ఈ నెల 12న ఉదయం 11 గంటలకు నామినేషన్ల స్క్రూట్నీ జరుగుతుందని తెలిపారు. 15 మధ్యాహ్నం 3 గంటల వరకూ నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంటుందని, 19న ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించారు.

భారీ వాహనాలపై అదుపేదీ ?

- ఎండాడ, సాగర్‌నగర్ ఇరుకు రోడ్లపై ట్రిప్పర్లతో జనం అవస్థలు
- చోద్యం చూస్తున్న జివిఎంసి అధికారులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

నగరంలో శరవేగంగా నిర్మాణ రంగం ముందుకు వెళ్తున్న ప్రాంతాల్లోకి వచ్చే ఎండాడ, సాగర్‌నగర్, వివేకానందనగర్‌లలో భారీ వాహనాల రణగొణ ధ్వనులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రీ, పగలూ పెద్ద ఎత్తున భారీ ట్రిప్పర్లు శరవేగంగా ఇసుక, మట్టి, ఇతర ఇనుప సామగ్రితో దూసుకెళ్తుండంతో బెంబేలెత్తుతున్నారు. ఉదయం నాలుగు గంటల నుంచే రోడ్లపై హల్‌చల్ చేయడంతో తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు. ఈ వాహనాల కారణంగా రోడ్లపై దుమ్మూ ధూళి ఇళ్లలోకి చేరుతోంది. చిన్నా, పెద్దా అన్ని తరగతులవారికీ అనారోగ్య సమస్యలను తెచ్చిపెడుతోంది. ఈ నేపథ్యంలో భారీ ట్రిప్పర్లను నగరం, కాలనీల్లోకి జివిఎంసి అధికారులు ఎలా అనుమతిస్తున్నారంటూ జనం దుమ్మెత్తిపోస్తున్నారు. ఎండాడ పెట్రోల్ బంక్ జంక్షన్ నుంచి వీటిని అదుపు చేయాలని, అక్కడ ఇనుప రాడ్లతో ఒక స్టాండ్ ఏర్పాటు చేసి భారీ లారీలను (స్కూల్ బస్సులను మినహా) రానివ్వకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

అసలు కారణం ఏంటి ?

స్థానికంగా తలపెట్టిన ఓ ప్రాజెక్టు కోసం కొండ తవ్వకాలు ఇక్కడ సాగుతున్నాయి. భారీ అపార్టుమెంట్ల పనులూ జరుగుతున్నాయి. వీటి అవసరార్థం ఈ భారీ ట్రిప్పర్లు, వాహనాలు ఇష్టానుసారం తిరుగుతున్నాయి. వీటి రాకపోకలు అధికమవడంతో రోడ్డు అధ్వానంగా తయారై తారు రోడ్డు ఆనవాళ్లే లేకుండా పోయింది. జివిఎంసి అధికారులు సైతం సదరు వాహనాల అదుపునకు ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. బీచ్ రోడ్డు మార్గంలో ఈ తరహా భారీ ట్రిప్పర్లను అనుమతించాలని, ఇరుకైన సాగర్‌నగర్, వివేకానందనగర్, ఎండాడ రోడ్లపై అనుమతించకూడదని ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా.. వివేకానందనగర్ పార్కు వద్ద మిగతా 2లో..



ఇరుకు రోడ్డులో వెళ్తున్న భారీ వాహనం

మొదటి పేజీ తరువాయి..

విరివిగా రుణాలివ్వండి

మార్చి 2023 నెలాఖరుకు రూ.70,769 కోట్లు పంపిణీతో 266 శాతం ప్రగతి సాధించినట్లు పేర్కొన్నారు. వ్యవసాయ రుణాల నిమిత్తం రూ.3,999 కోట్లు లక్ష్యానికిగాను రూ.5,554 కోట్లతో 139 శాతం, ప్రాధాన్య రంగాలకు సంబంధించి రూ.13,758 కోట్ల లక్ష్యానికిగాను రూ.16,629 కోట్లు పంపిణీతో 121 శాతం, అప్రాధాన్యత రంగాలకు రూ.12,876 కోట్ల లక్ష్యానికిగాను రూ.54,140 కోట్లుతో 420 శాతం ప్రగతి సాధించినట్లు పేర్కొన్నారు. ఎంఎస్ఎంఇ రంగానికి రూ.7,503 కోట్ల లక్ష్యానికిగాను రూ.10,072 కోట్లుతో 134 శాతం ప్రగతి సాధించినట్లు పేర్కొన్నారు. అనంతరం వివిధ ప్రభుత్వ పథకాలను, రుణ వితరణలను కలెక్టర్ సమీక్షించారు. విశాఖ జిల్లా అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులు తమ శాఖలను విస్తరించాలని ఆదేశించారు. జిల్లాలో అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరు చేసామని, వాటి పూర్తికి బ్యాంకర్లు రుణాలు ఇవ్వాలని అన్నారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఎల్‌డిఎం వివిఎస్.శర్మ, ఆర్‌బిఐ ఎల్‌డిఓ పూర్ణిమ, నాబార్డ్ డిడిఎం సమంత్, ఎస్ఎల్‌బిసి చీఫ్ మేనేజర్ శ్రీనివాస్, డిఆర్‌డిఎ పిడి శోభారాణి, జివిఎంసి యుసిడి పిడి పాపినాయుడు, వ్యవసాయ శాఖ అధికారి అప్పలనాయుడు, పశుసంవర్ధక శాఖ జెడి డాక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

భారీ వాహనాలపై అదుపేదీ ?

షాపులకు వైసిపి నాయకులు అక్రమంగా అనుమతులు ఇవ్వడంతో ఇంకా ఈ రోడ్డు ఇరుకుగా మారింది. భారీ వాహనాలు వచ్చేటప్పుడు రద్దీ పెరిగిపోతోంది. ఇప్పటికైనా జివిఎంసి, రెవెన్యూ అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

షిప్‌యార్డులో కాంట్రాక్టర్ ఆగడాలు

- నాలుగు నెలలుగా జీతాలందక కార్మికుల అవస్థలు

- లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్)లో లీడ్ ఇంజినీరింగ్ కాంట్రాక్టరు మోసాలకు పాల్పడుతూ 82 మంది కాంట్రాక్టు కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలివ్వకపోవడంతో కార్మికులంతా మంగళవారం ఆందోళనకు దిగారు. షిప్‌యార్డు గేటు వద్ద ఉదయం 11 గంటల సమయంలో కాంట్రాక్టరు తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. అనంతరం నగరంలోని లేబర్ డిపార్ట్‌మెంట్ కార్యాలయానికి చేరుకుని తమ గోడు వెళ్లదీశారు. ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయాలని లేబర్ అధికారులు వీరిని కోరగా ఆ విధంగా కాంట్రాక్టర్‌పై ఫిర్యాదు చేశారు. గడిచిన నాలుగు నెలలుగా జీతాలివ్వకుండా, 12 నెలల నుంచి తమ పిఎఫ్ డబ్బులు కట్టకుండా తమను వేధిస్తున్న సదరు కాంట్రాక్టరుపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. లీడ్ ఇంజినీరింగ్ పేరుతో షిప్‌యార్డులో కాంట్రాక్టు దక్కించుకున్న ఆ ప్రైవేట్ వ్యక్తి చర్యలపై యాజమాన్యం స్పందించాలని, తమ జీతభత్యాలు చెల్లించాలని కోరారు. సమస్యపై ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా కాంట్రాక్టర్ నోరుమెదపడం లేదంటూ కార్మికులు తీవ్రస్థాయిలో ఆవేదన చెందారు.

విశాఖలో సాయిధరమ్ తేజ్ సందడి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆర్‌టి టీమ్ వర్క్స్, గోల్డెన్ మీడియా బ్యానర్స్‌పై కల్యాణ్ సంతోష్ నూతన దర్శకత్వంలో వైవా హర్ష, దివ్య శ్రీపాద జంటగా నటించిన సుందరం మాస్టర్ సినిమా టీజర్‌ను హీరో సాయి ధరమ్ తేజ్ మంగళవారం సిరిపురంలోగల వివిఅర్‌డిఎ చిల్డ్రన్ ఎరీనాలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుందరం మాస్టర్ అందరినీ కడుపుబ్బా నవ్విస్తాడని అన్నారు. తనకు ఇష్టమైన హీరో రవితేజ స్థాపించిన ఆర్‌టి టెక్నాలజీ సంస్థ ద్వారా ఈ చిత్ర నిర్మాణం చేపట్టడం సంతోషంగా ఉందని అన్నారు. విశాఖ ప్రజలు కొత్తవారి ప్రతిభను ఎల్లప్పుడూ ఆదరిస్తారన్నారు. చిత్ర కథానాయకుడు హర్ష మాట్లాడుతూ హీరో రవితేజ బ్యాగ్రౌండ్ లేకుండా ఎదిగిన హీరో అని కొనియాడారు. శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్న ఈ మూవీకి దీపక్ ఎరెగడ సినిమాటోగ్రఫీ అందిస్తున్నట్లు నిర్మాతలు తెలిపారు. కార్యక్రమంలో చిత్ర దర్శకుడు కల్యాణ్ సంతోష్, నటి దివ్య శ్రీపాద, ఎడిటర్ కార్తీక్, ఆర్ట్ డైరెక్టర్ చంద్ర మౌళి, సినీ దర్శకులు రవికాంత్, సంగీత దర్శకుడు శ్రీ చరణ్, శ్రీకాంత్, శరణ్, నిర్మాతలు సుధీర్, నాయక్, డిసిపి విద్యాసాగర్ నాయుడు, వైసిపి నేత డి.శ్రీవాస్తవ, ప్రశాంత్ పాల్గొన్నారు.

23న ప్రజా సింహ గర్జనకు తరలిరండి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలో వైసిపి అరాచక పాలనను గద్దె దించి, బిసిలకు రాజ్యాధికారం వచ్చేలా త్వరలో నూతన పార్టీ ఆవిర్భావం జరగనున్నదని బిసి సంఘం జాతీయ నేత బోడె రామచంద్ర యాదవ్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో భారతీయ యాదవ మహాసభ అనకాపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మొల్లి సన్నిబాబు ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నూతన పార్టీ ఆవిర్భావ సన్నాహక సమావేశం జరిగింది. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

ఈ నెల 23న దళిత, బహుజన, రైతు, శ్రామిక, మైనారిటీ, వెనుకబడిన తరగతుల రాజ్యాధికారం కోసం ప్రజా సింహ గర్జన పేరిట భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశామన్నారు. దీనికి గుంటూరు - విజయవాడ జాతీయ రహదారి సమీపంలోని నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్న స్థలం వేదిక కానుందని అన్నారు. సిఎం జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టారని మండిపడ్డారు. సమావేశంలో భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నమ్మి అప్పలరాజు యాదవ్, బిసి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కిలాడి అప్పలరాజు పాల్గొన్నారు.

దద్దరిల్లిన కలెక్టరేట్లు



విశాఖలో నినదిస్తున్న వందలాది మంది అంగన్‌వాడీలు

(మొదటి పేజీ తరువాయి..) ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, కార్యదర్శి బి.జగన్, అప్పలరాజు, ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవ అధ్యక్షురాలు పి.మణి, అధ్యక్షురాలు బి.తులసి, కార్యదర్శి ఎల్.దేవి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.శోభారాణి, కోశాధికారి కె.పద్మావతి, సలహాదారు కె.బృందావతి తదితరులు అరెస్టయిన వారిలో ఉన్నారు.

అంతకు ముందు జరిగిన బహిరంగ సభలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తెలంగాణ రాష్ట్రం కంటే అదనంగా వెయ్యి రూపాయలు ఇస్తానని హామీ ఇచ్చి దాన్ని అమలు చేయకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇప్పటికైనా శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అనకాపల్లి ప్రతినిధి, అనకాపల్లి విలేకరి : అంగన్‌వాడీల నినాదాలతో అనకాపల్లి కలెక్టరేట్ దద్దరిల్లింది. దీక్షా శిబిరం నుంచి ర్యాలీగా వచ్చిన అంగన్‌వాడీలను పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. దీంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ తోపులాటలో వి.మాడుగులకు చెందిన సూర్యకళావతి, సరోజిని స్పృహతప్పి పడిపోయారు. వారిద్దరికీ 108లో ప్రాథమిక చికిత్స అందించారు. అఖిల భారత కోర్కెల దినం సందర్భంగా కలెక్టరేట్ వద్ద సోమవారం



అనకాపల్లిలో స్పృహ తప్పి పడిపోయిన సరోజిని

అంగన్‌వాడీలు చేపట్టిన 36 గంటల మహాధర్నా మంగళవారంతో ముగిసింది. ఈ క్రమంలోనే మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. నిరసనకారులను రోప్, స్టాపర్లతో పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో అంగన్‌వాడీలు కిందపడిపోయారు. తొలుత ఎపి కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణను పోలీసులు ఎత్తుకొని తీసుకెళ్తుండగా అంగన్‌వాడీలు అడ్డుకున్నారు. అంచెలంచెలుగా అంగన్‌వాడీలను చెల్లాచెదురు చేయాలని పోలీసులు చేసిన ప్రయత్నాలను తిప్పికొట్టి తమ నిరసన కొనసాగించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, దేముడు నాయుడు, జిల్లా నాయకులు గంటా శ్రీరామ్, బ్రహ్మాజీను బలవంతంగా వాహనంలోకి పోలీసులు ఎక్కించారు. ఆర్.రామును ఈడ్చుకుంటూ వాహనంలోకి విసిరేయడంతో కాలుపాదం బెణికింది. కోటేశ్వరరావు కుడిపాదం వాచింది. నాయకులను పోలీసులు వాహనంలో తరలించే ప్రయత్నాలను అంగన్‌వాడీలు అడ్డుకున్నారు. దీంతో నాయకులను వాహనం పోలీసులు నుంచి దించేశారు. డిఆర్‌ఒ వెంకటరమణ నిరసనకారుల వద్దకు వచ్చి అంగన్‌వాడీల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దుర్గారాణి, ఎం.నాగశేషు, కాసులమ్మ, వివి రమణమ్మ, భవాని, జానకి, జిల్లా నాయకులు జి.కుమారి, మంగ, సామ్రాజ్యం, సుబ్బలక్ష్మి, జయ, ఉమా నారాయణమ్మ, సత్యవేణి, జయలక్ష్మి, సిఐటియు నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, సోమునాయుడు, జి.నాయినిబాబు తదితరులు పాల్గొన్నారు.

తడిసిన శిబిరంలోనే నిద్ర

మహాధర్నా చేపట్టిన అంగన్‌వాడీలు సోమవారం రాత్రి శిబిరంలోనే నిద్రపోయారు. వర్షానికి టార్పాలిన్లు తడిసిపోయాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దోమలు కుడుతున్నా మంగళవారం ఉదయం వరకు పట్టుదలతో వున్నారు.

పలువురి మద్దతు

మహాధర్నా చేసిన అంగన్‌వాడీలకు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు సంఘీభావం ప్రకటించారు. టిడిపి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి, ఐకెపి రాష్ట్ర అధ్యక్షులు రూపాదేవి, సిఐటియు ఉపాధ్యక్షులు ఆర్.రాము, ఎస్.బ్రహ్మాజీ, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, కోశాధికారి వివి.శ్రీనివాసరావు సంఘీభావం ప్రకటించారు.

2024 ఎన్నికల్లో అంగన్‌వాడీలు బటన్‌నొక్కుతారు : కోటేశ్వరరావు

నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలకు బటన్ నొక్కుతున్న జగన్మోహన్‌రెడ్డి అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకపోతే 2024 ఎన్నికల్లో అంగన్‌వాడీలు బటన్‌నొక్కాల్సివుంటుందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు హెచ్చరించారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకుండా తక్కువ వేతనాలతో పనిచేయించుకోవడం దుర్మార్గమన్నారు. ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలన్నారు. పోలీసు నిర్బంధకాండపై మండిపడ్డారు.

అంగన్వాడీల అరెస్టులు గర్హనీయం : సిపిఎం

విశాఖలో అంగన్‌వాడీల అక్రమ అరెస్టులు గర్హనీయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. ప్రభుత్వ, పోలీసు నిర్బంధాన్ని వారు వేర్వేరు ప్రకటనల్లో మంగళవారం ఖండించారు. సానుకూలంగా స్పందించి అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం రెచ్చగొట్టేలా వ్యవహరించడం సరికాదన్నారు. ప్రభుత్వ తీరును సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు వేరొక ప్రకటనలో ఖండించారు.

సీతామహాలక్ష్మికి ఉత్తమనటి బహుమతి

కలెక్టరేట్ : పొలపల మల్లికార్జునరావు మెమోరియల్ ఫైన్ ఆర్ట్స్, వైఎస్ఆర్ కళా పరిషత్తు సంయుక్తంగా విజయవాడలో నిర్వహించిన జాతీయ స్థాయి నాటిక పరిషత్తు పోటీల్లో నగరానికి చెందిన 'జాస్మిన్ ఆర్ట్స్ కల్చరల్ అసోసియేషన్' ప్రదర్శించిన 'సంకల్పం' నాటికలో సీతామహాలక్ష్మికి ఉత్తమ నటి బహుమతి లభించింది.

ఎయు, గీతంతో నేవీ అవగాహన ఒప్పందం

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ, మధురవాడ : ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఉపయుక్తంగా ఇంటర్న్ షిప్ లను అందించేందుకు ఇండియన్ నేవీతో ఆంధ్ర విశ్వవిద్యాలయం, గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం చేసుకున్నాయి. ఏయూ పాలకమండలి సమావేశం మందిరంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎయు విసి ఆచార్య పివిజిడి.ప్రసాద్‌రెడ్డి సమక్షంలో నేవల్ డాక్‌యార్డు అడ్మిరల్ సూపరింటెండెంట్ రియల్ అడ్మిరల్ సంజయ్ సాధు, ఎయు రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ సంతకాలు చేశారు. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ఇన్స్ట్రుమెంటేషన్, మెరైన్ ఇంజినీరింగ్, నేవల్ ఆర్కిటెక్చర్ కోర్సులను అభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన, నైపుణ్యాలను పెంపొందించే దిశగా నేవల్ డాక్‌యార్డు ప్రత్యేకమైన ఇంటర్న్ షిప్‌ను అందించనుంది.

ఈ కార్యక్రమంలో ఎయు రెక్టర్ ఆచార్య కె.సమత, ప్రిన్సిపల్ ఆచార్య జి.శశిభూషణరావు, ఆచార్య ఎస్‌కె.బట్టి, అకాడమిక్ డీన్ ఆచార్య ఎన్ కిషోర్‌బాబు, అకాడమిక్ సెనేట్ సభ్యులు డాక్టర్ కుమార్‌రాజ, భారత నావికాదళానికి చెందిన సర్వీస్ అధికారులు అనూప్ మీనన్, ఆర్ వెంకటేశ్వరన్, కెప్టెన్ సుబ్రతో మండల్, గీతం ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, గీతం కార్యదర్శి ఎమ్.భరద్వాజ, డీన్ ప్రొఫెసర్ సి.విజయశేఖర్, ఎస్.వంశీకృష్ణ, నేవల్ డాక్‌యార్డ్ అధికారులు, కెరీర్ గైడెన్స్ సెంటర్ అధికారులు పాల్గొన్నారు.



ఎయుతో అవగాహన ఒప్పందం చేసుకుంటున్న నేవీ అధికారులు

నేరాలు ఘోరాలు

నూకాంబిక దేవాలయం హుండీ చోరీ

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని లింగంపేట నూకాంబిక దేవాలయంలో హుండీ చోరీ జరిగింది. వడ్డాదికి చెందిన వ్యక్తి లింగంపేట పంచాయతీ రామచంద్రాపురం గ్రామానికి బంధువుల ఇంటికి వచ్చి మంగళవారం తెల్లవారుజామున చోరికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న స్థానికులు అతన్ని పట్టుకొని ఆరా తీయగా తానే హుండీలో ఉన్న డబ్బును తీసికున్నట్లు ఒప్పుకోవడంతో స్థానికులు పోలీసులకు అప్పగించారు. నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు.

బాలుడి మృతిపై కేసు నమోదు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని సిహెచ్‌బి అగ్రహారం గ్రామానికి చెందిన పడాల రాజారావు తన కుమారుడు కిరణ్ (16) వ్యాన్లో ప్రయాణిస్తుండగా కిందపడి మతి చెందినట్లు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం సాయంత్రం తన కుమారుడు కిరణ్ గొడిచెర్ల కొత్తూరు నుంచి గొడిచెర్ల వచ్చేందుకు ఒక మినీ వ్యాన్ తొట్టిలో ఎక్కాడని, గొడిచెర్ల గ్రామ సమీపాన రైలు వంతెన కింద నుంచి వ్యాన్ వచ్చినప్పుడు వ్యాన్ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతో రైల్వేవంతెనకు కిరణ్ తల తగలడంతో తీవ్రగాయాలతో తొట్టెలో పడిపోయినట్లు తెలిపారు. వెంటనే వ్యాన్ డ్రైవర్ గొడిచెర్ల ఆస్పత్రికి తరలించగా, ప్రథమచికిత్స అనంతరం నక్కపల్లి ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే కిరణ్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శిరీష తెలిపారు

ఓటరు హౌస్ మ్యాపింగ్

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి, రెండో వార్డు పరిధి 155, 256 పోలింగ్ కేంద్రాల పరిధిలో టిడిపి వార్డు కార్పొరేటర్ గాడు చిన్ని కుమారిలక్ష్మి ఆధ్వర్యాన పార్టీ నాయకులు మంగళవారం పర్యటించారు. ఓటరు జాబితా పరిశీలనలో మృతి చెందిన ఓటర్ల పేర్లు, డబుల్ ఓటర్లు, వలస వెళ్లిన వారిని గుర్తించారు. ఓటరు హౌస్ మ్యాపింగ్ చేశారు. టిడిపి అధిష్టానం ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గాడు అప్పలనాయుడు, జీరు సత్యంరెడ్డి, సరగడ గోపీరెడ్డి, చిల్ల ఎర్రయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న పార్లమెంటరీ సబ్ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను మంగళవారం పార్లమెంటరీ అధికార భాష కమిటీ సభ్యులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. వారిని ఆలయ ఎఇఒ భ్రమరాంబ, ఆలయ పర్యవేక్షకులు సునీల్ కుమార్ సత్కరించి, స్వామివారి ప్రసాదాన్ని అందించారు.

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సచివాలయ సెక్రటరీ

ప్రజాశక్తి-ఉక్కునగరం : అగనంపూడి 79వ వార్డు ప్రశాంతినగర్ సచివాలయ సెక్రటరీ రూ.20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. ప్రశాంతినగర్ సచివాలయంలో తమ్మడాల భాస్కర్ సెక్రటరీగా పని చేస్తున్నారు. గత కొంతకాలంగా ఇతను అనేక అక్రమాలకు పాల్పడుతున్నట్లు సమాచారం అందటంతో ఎసిబి అధికారులు నిఘా పెట్టారు. అగనంపూడి సచివాలయంలో తండ్రి ఇంటిని ఇద్దరు అన్నదమ్ములు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అన్నదమ్ములకు ఇంటి పన్ను వేరు చేసేందుకు భాస్కర్ రూ.20 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితులు ఎసిబిని ఆశ్రయించారు. ఎసిబి అధికారుల సూచనల మేరకు మంగళవారం సాయంత్రం బాధితులు డబ్బులు పట్టుకొని సచివాలయానికి వెళ్లారు. కార్యాలయంలోనే బాధితుల నుంచి సెక్రటరీ భాస్కర్ లంచం తీసుకుంటుండగా ఎసిబి సిఐ కిశోర్‌కుమార్ అదుపులోకి తీసుకున్నారు.

ఆదర్శ నగర్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్



స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కల్పిస్తున్న జోనల్ కమిషనర్ రాము

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండో వార్డు పరిధి ఆదర్శనగర్‌లో మంగళవారం జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము ఆధ్వర్యాన స్వచ్ఛ సర్వేక్షణ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్లాస్టిక్ సంచుల వాడకం ఆరోగ్యానికి మంచిదికాదని, పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని తెలిపారు. ఇంటితో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్థానికులనడిగి పలు సమస్యలు తెలుసుకున్నారు. ఇంటి ముంగిటకు వచ్చిన క్లాప్ వాహనానికి తడి, పొడి, ప్రమాదకర చెత్తను వేర్వేరుగా చేసి అందజేయాలని స్థానికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది, వాలంటీర్లు, వైసిపి నాయకులు సిహెచ్ భాస్కరరెడ్డి, సిహెచ్.వెంకటేష్, బి.హరికిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - తగరపువలస : జివిఎంసి 5వ వార్డు పరిధి సాయిరాం కాలనీలో అంబేద్కర్ విగ్రహం తల భాగాన్ని ధ్వంసం చేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర దళిత సంక్షేమ సంఘం నాయకులు భాగం గోపాలరావు, జై భీమ్ బహుజన యువ సేవా సంఘం సలహాదారు బోని ఈశ్వర్‌కుమార్, ఆదిరాజు, ఆదినారాయణ, భాస్కరరావు తదితరులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.



వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం అందజేస్తున్న కార్పొరేటర్ కెల్ల సునీత

వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం అందజేత

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు ఆరిలోవ కాలనీ, లక్ష్మీపార్వతినగర్‌లో పిట్టా ఉమావపతి (35) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులకు వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత వైఎస్ఆర్ బీమా పథకంలో భాగంగా తక్షణ సాయం కింద రూ.10 వేలును మంగళవారం అందజేశారు. మిగిలిన మొత్తం నామినీ బ్యాంకు ఖాతాలో త్వరలో జమచేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శిరీషా, సచివాలయ కన్వీనర్లు వెంకటరెడ్డి, పోలారావు, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలపై నిరసనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

వాలంటీర్లపై జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై మంగళవారం జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల నిరసనలు తెలిపారు. పవన్ కల్యాన్ క్షమాపణలు చెప్పాలంటూ వాలంటీర్లు, వైసిపి నాయకులు డిమాండ్‌చేశారు.

సీతమ్మధార : 25వ వార్డు వైసిపి స్టాండింగ్ కమిటీ సభ్యులు సారిపల్లి గోవిందు ఆధ్వర్యాన సీతంపేట మెయిన్ రోడ్డులో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు. 26వ వార్డులో వైసిపి అధ్యక్షులు పీల వెంకటలక్ష్మి ఆధ్వర్యాన నిరసన తెలిపారు.

45వ వార్డులోని సచివాలయాల వద్ద వైసిపి అధ్యక్షులు పైడి రమణ ఆధ్వర్యాన వాలంటీర్లు నిరసన తెలిపారు. తాటిచెట్లపాలెం ఆంజనేయ స్వామి ఆలయం నుంచి 80 అడుగుల రోడ్డు వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ మానవహారం నిర్మించారు. ఈ కార్యక్రమంలో రాయుడు శ్రీను, హరి పట్నాయక్, నేపాల్ శ్రీను, రాజు యాదవ్, బాబూరావు, రామారావు, సన్నీ, దుర్గ, నాయుడు, నాని, ప్రభాకర్, పైడి నాగరాజు, గణపతి, జోగినాయుడు, ఆదిలక్ష్మి, రవి శంకర్, పాల్గొన్నారు.

జివిఎంసి 44వ వార్డు కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు ఆధ్వర్యాన 80 అడుగుల రోడ్డులో వాలంటీర్లు నిరసన తెలిపారు. పవన్‌కల్యాన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అభి, గోపి, తిరుపతి, వైసిపి నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు. **ఆరిలోవ :** జివిఎంసి 9, 10, 11, 12, 13 వార్డుల పరిధిలోని వాలంటీర్లు ఆరిలోవ పోలీసుస్టేషన్ ముందు నిరసన తెలిపారు. వీరికి తూర్పు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల, కార్పొరేటర్లు అక్కరమాని రోహిణి, కెల్ల సునీత సత్యనారాయణ సంఘీభావం తెలిపారు. అనంతరం పవన్ కల్యాణ్‌పై ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కెల్ల సత్యనారయణ, సత్తి మందారెడ్డి, కన్నేటి సుబ్బారెడ్డి, బాలరాజు, ముద్దాడ పాపారావు పాల్గొన్నారు.



44వ వార్డులో బాణాల శ్రీనివాసరావు ఆధ్వర్యాన వాలంటీర్ల నిరసన

తగరపువలస : తగరపువలస జంక్షన్‌లో వాలంటీర్లు నిరసన తెలిపారు. ర్యాలీ అనంతరం పవన్ కల్యాణ్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు అక్కరమాని రాము నాయుడు, జగుపిళ్ళ ప్రసాద్, బింగి హరికిరణ్‌రెడ్డి, వెంపాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆందోళన

తగరపువలస జంక్షన్‌లో జనసేన నాయకులు కూడా ఆందోళన చేపట్టారు. వాలంటీర్ల పేరుతో యువత జీవితాలను నాశనం చేస్తున్న వైసిపి ప్రభుత్వం అంటూ ర్యాలీ నిర్వహించారు. పవన్ కల్యాణ్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇఎన్ఎస్ చంద్ర రావు, కృష్ణయ్య, పరిమి భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు. ఈ క్రమంలో వైసిపి, జనసేన నాయకులు, కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది.

మునగపాక రూరల్ : వాలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన అధ్యక్షులు కొణిదల పవన్ కళ్యాణ్‌ను తక్షణం అరెస్ట్ చేయాలని కోరుతూ మండల కేంద్రం మునగపాక మెయిన్ రోడ్‌పై మంగళవారం వాలంటీర్లు మానవహారం నిర్వహించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వాలంటీర్లు మాట్లాడుతూ ఇటీవల ఏలూరులో జరిగిన సభలో వాలంటీర్లు ఒంటరిగా ఉన్న మహిళలను, వితంతు మహిళలను టార్గెట్ చేసి విదేశాలకు, సంఘవిద్రోహశక్తులకు సమాచారం ఇస్తున్నారని పవన్ కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వాలంటీర్లకు ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వీరి ధర్నాకు వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, జెడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, వైసిపి నాయకులు ఆడారి గణపతి అచ్చం నాయుడు, పొలిమేర పూర్ణచంద్ర గణేష్, పలువురు వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు సంఘీభావం తెలిపారు.

యస్ రాయవరం : వాలంటీర్లుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని వాలంటీర్లు నిరసన చేపట్టారు. మంగళవారం మండలంలో అడ్డరోడ్డు నాలుగు రోడ్ల కూడలిలో శ్రీ గురజాడ వాలంటీర్స్ అసోసియేషన్ భారీ ర్యాలీ నిర్వహించారు ప్రెసిడెంట్ నానేపల్లి అప్పలరాజు మాట్లాడుతూ పవన్ కల్యాణ్ స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

విశాఖ కలెక్టరేట్ : వాలంటీర్ వ్యవస్థపై పవన్ కల్యాణ్ చేసిన ఆరోపణలను ఖండిస్తూ మంగళవారం 32వ వార్డులో వైసిపి వార్డు అధ్యక్షులు మూలే రామిరెడ్డి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పవన్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.

అగనంపూడి సమస్యలపై ఎంపీకి వినతి

ప్రజాశక్తి-ఉక్కునగరం : అగనంపూడి ప్రాంత సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విశాఖ ఎంపీ ఎంవివి.సత్యనారాయణకు అగనంపూడి నిర్వాసితకాలనీ అఖిలపక్ష నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. తలారివానిపాలెం రైల్వే ట్రాక్ అండర్ పాత్ వేను విస్తరించాలని, అగనంపూడి టోల్ ప్లాజాను తక్షణమే తొలగించాలని, హోమీ బాబా కేన్సర్ ఆసుపత్రిలో స్థానికులకు 75 శాతం ఉద్యోగ నియామక అవకాశం కల్పించాలని వినతిలో కోరారు. దీనిపై స్పందించిన ఎంపీ ఎంవివి సత్యనారాయణ మాట్లాడుతూ, అగనంపూడి ప్రాంత సమస్యలను ఇప్పటికే గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తన దృష్టికి తీసుకొచ్చారని, ఈ సమస్యలను సంబంధిత శాఖల కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపిడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ఎవేర్‌నెస్ అసోసియేషన్ విశాఖ జిల్లా చైర్మన్ మోటూరి వెంకటరమణ, వైసిపి నాయకులు తోకాడ రాము, జనసేన నాయకులు మజ్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పోలీసులను సత్కరిస్తున్న బ్రహ్మకుమారీలు

పోలీసులకు మెడిటేషన్‌పై శిక్షణ

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ పోలీసులకు బ్రహ్మకుమారీలు మంగళవారం మెడిటేషన్‌పై శిక్షణ ఇచ్చారు. మెడిటేషన్ వల్ల కలిగే లాభాలను పెదగంట్యాడ వినాయకనగర్, వుడాకాలనీలోని బ్రహ్మకుమారి సెంటర్ ఇన్‌ఛార్జి శాంతి, లావణ్య వివరించారు. పోలీస్ డ్యూటీలో ఒత్తిడిని తగ్గించే పలు సూచనలు చేశారు.

కోవిడ్ సమయంలో చేసిన సేవలకుగాను స్టీల్ ప్లాంట్ పోలీస్ స్టేషన్ సిబ్బందికి ప్రోత్సాహకంగా బ్రహ్మకుమారి సభ్యులు మెడల్స్, సర్టిఫికెట్స్ ఇచ్చి అభినందించారు. ఈ సర్టిఫికెట్లను, మెడల్స్‌ను బ్రహ్మకుమారి ముఖ్య కేంద్రమైన మౌంట్ అబూ నుంచి తెప్పించినట్టు సభ్యులు వెల్లడించారు.


సేంద్రియ వ్యవసాయంపై వివరిస్తున్న ఎన్‌ఎఫ్‌ఎమ్ టి పద్మ తదితరులు

కరకవానిపాలెంలో పొలం బడి

ప్రజాశక్తి-పెందుర్తి : మండలంలోని కరకవానిపాలెంలో మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎఫ్ఎంటి పద్మ మాట్లాడుతూ, సేంద్రియ వ్యవసాయంతో మంచి పంట దిగుబడి వస్తుందన్నారు. కృత్రిమ ఎరువులు కన్నా సేంద్రియ ఎరువుతో పండిన పంటలు ఆరోగ్యానికి మంచి చేస్తాయని చెప్పారు. భూమి సారంగా ఉండడానికి ఘనామృతం వెయ్యాలని సూచించారు. బీజామృతం వల్ల విత్తనం శుద్ధి అయ్యి తెగుళ్లను నివారించవచ్చని తెలిపారు. ద్రవ బీజామృతం వేయడం వల్ల మొక్క ఆరోగ్యంగా పెరుగుతుందని తెలిపారు, ఆకులు, పేడ, మూత్రంతో కషాయం చేసి మొక్కలకు వేస్తే తెగుళ్లను నివారించవచ్చని చెప్పారు. ఇలా చేయడం వల్ల భూసారం పెరిగి రైతులకు మంచి పంట చేతికి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎ వనజ, అనూరాధ, ఐసిఆర్‌పిఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామ దేవతల పండగ

ప్రజాశక్తి-సింహాచలం: సింహగిరిపైనున్న గ్రామదేవతలు ఉమామహేశ్వరి, పాదాలమ్మ, పుట్ట బంగారం అమ్మవార్ల పండుగను గ్రామస్తులు, దేవస్థానం అధికారులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి పండుగను పురస్కరించుకొని దేవస్థానం తరపున వస్త్రాలు, పసుపు కుంకుమలను అధికారులు సమర్పించారు. అమ్మవారిని గ్రామస్తులు వేకువజామునుంచే దర్శించుకొని, పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

అదానీ గంగవరం పోర్టు కార్మికుల భిక్షాటన

ప్రజాశక్తి -గాజువాక : అదాని గంగవరం పోర్టు యాజమాన్యం మొండి వైఖరికి నిరసనగా నిర్వాసిత కార్మికులు పాత గాజువాక జంక్షన్‌లో మంగళవారం మానవహారం నిర్వహించారు. అనంతరం కార్మికులు పాత గాజువాక జంక్షన్ నుంచి పెదగంట్యాడ వరకు భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు మాట్లాడుతూ, గంగవరం పోర్టు నిర్మాణం జరిగితే గంగవరం, దిబ్బపాలెం నిర్వాసితుల బతుకుల్లో వెలుగులు వస్తాయని ఆశించామని, కానీ వారిని పోర్టు యాజమాన్యం భిక్షగాళ్లను చేసిందని ఎద్దేవా చేశారు. గంగవరం పోర్టు యాజమాన్యం మొండివైఖరి విడనాడాలని, కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరారు.

గాజువాక మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య మాట్లాడుతూ, గంగవరం పోర్టు యాజమాన్యం మొండిగా వ్యవహరించడం మానుకోవాలన్నారు. పోర్టు నిర్మాణం కోసం ఎంతో త్యాగం చేసిన నిర్వాసిత కార్మికులు చాలీచాలని జీతభత్యాలతో రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం కలుగజేసుకొని సంప్రదింపులు ద్వారా సమస్యను పరిష్కరించాలని కోరారు. సిఐటియు స్టీల్ జోన్ ప్రధాన కార్యదర్శి కొవిరి అప్పలరాజు మాట్లాడుతూ, వేతనాలు పెంచాలని కోరుతూ కార్మికులు పోరాడుతుంటే యాజమాన్యం నోటీసులు ఇచ్చి బెదిరిస్తోందని తెలిపారు. గంగవరం పోర్టు యాజమాన్యం దుర్మార్గపు చర్యలకు ప్రతి చర్యగా కార్మికులు విధులు బహిష్కరించి నిరసనలు తెలుపుతుంటే ఒక రోజుకు 8 రోజుల వేతనం కట్ చేస్తామని యాజమాన్యం హెచ్చరిక నోటీసులు పంపించడం మానుకోవాలన్నారు. గంగవరం పోర్టు యాజమాన్యం కార్మికులను మూకుమ్మడిగా విధులకు రాకుండా అడ్డుకోవడంతో నిరసనగా కార్మికులు విధులు బహిష్కరించారని తెలిపారు. కలెక్టర్ చెప్పిన సూచనలను కూడా యాజమాన్యం పట్టించుకోకుండా మొండిగా వ్యవహరిస్తోందన్నారు. ఉద్యమం ఉధృతం అయితే జరిగే పరిణామాలకు అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వాసుపల్లి ఎల్లాజీ, గంటిపిల్లి అమ్మోరు, మాద అప్పారావు, పేర్ల నూకరాజు, కదిరి సత్యానందం, గంటిపిల్లి లక్ష్మయ్య, కొవిరి అమ్మోరు తదితరులు పాల్గొన్నారు.



గాజువాకలో భిక్షాటన చేస్తున్న కార్మికులు

అంగన్‌వాడీ, గంగవరం పోర్టు కార్మికులకు మద్దతుగా ఆందోళన



పెందుర్తిలో నిరసన....

ప్రజాశక్తి-పెందుర్తి : అంగన్‌వాడీ కార్యకర్తలు, అదాని గంగవరం పోర్టు కార్మికులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా సిఐటియు నాయకులు పెందుర్తిలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జోన్ కార్యదర్శి శంకరరావు మాట్లాడుతూ, అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అదాని గంగవరం పోర్టు కార్మికులను విధుల నుంచి తొలగించడం, వారికి కనీస వేతనాలు ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. ప్రజలందరూ ఐక్య ఉద్యమాల ద్వారా హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు అప్పలనాయుడు, సూర్య ప్రకాష్, బాబూరావు, సిపిఎం జోన్ కార్యదర్శి రమణి, ఐద్వా నాయకులు రజిని తదితరులు పాల్గొన్నారు.

'నవలి' నిర్మాణంతో రాయలసీమకు తీవ్ర నష్టం'

ప్రజాశక్తి-మాధవధార : కర్ణాటకలోని తుంగభద్రకు సమాంతరంగా నవలి జలాశయం నిర్మాణంతో రాయలసీమకు తీవ్ర నష్టం కలుగుతుందని ఏపీ స్టేట్ కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ మూల వెంకటరావు పేర్కొన్నారు. ఇప్పటికే ఎగువ తుంగభద్రతో భయంగా ఉన్న రాయలసీమ వాసులను కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నవలి జలాశయం నిర్మాణం ప్రకటన మరింత ఆందోళనకు గురిచేస్తోందని తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టిపెట్టాలని కోరారు. తుంగభద్ర డ్యామ్‌లో పూడిక చేరడంతో 32 టిఎంసిల నీటి నిలువ సామర్థ్యం కోల్పోతున్నామని పేర్కొన్నారు. కొత్త రిజర్వాయర్ వల్ల 50 టిఎంసిలు ఆదా చేసి మూడు రాష్ట్రాల కరువు పీడిత ప్రాంతాలకు ఉపయోగకరంగా ఉంటుందని కర్ణాటక అంటుందని, జలాశయం పూర్తయ్యాక డ్యాంలో నీరు మాత్రమే వాడుకోవాలని, జలాశయంలో నీరు ఇవ్వమంటే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు నష్టపోతాయని వివరించారు. కర్నూలు జిల్లాలో ఆర్‌డిఎస్ కుడి కాలువ నిర్మాణానికి ఎన్నో అభ్యంతరాలు పెడుతున్న కర్ణాటక గవర్నమెంట్ మాత్రం ఎగువన తుంగభద్ర జలాలు వినియోగానికి కొత్త రిజర్వాయర్ నిర్మాణానికి సిద్ధమవడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. పూడిక నష్టాలను పూడ్చేందుకు సమాంతర కాలవలు నిర్మిస్తే సమస్య తీరుతుంది తప్ప జలాశయం నిర్మించి పొరుగు రాష్ట్రాలను భయభ్రాంతులకు గురిచేయడం మంచిది కాదని పేర్కొన్నారు. ఆలమట్టి డ్యామ్ ఎత్తును పెంచినప్పుడు కూడా మన నాయకులు పట్టించుకోలేదని తెలిపారు. నవలి జలాశయం విషయంపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, తుంగభద్ర బోర్డులో ఉన్న ఎపి ఇంజినీర్లు వ్యతిరేకించాలని కోరారు. ఈ విషయంపై ఎపి పిసిసి అధ్యక్షులు రుద్రరాజు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధారామయ్యతో చర్చిస్తారని తెలిపారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై ప్రతిఘటనోద్యమం

ప్రజాశక్తి-ఉక్కునగరం : మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించడానికి పటిష్టమైన కార్మికోద్యమ నిర్మాణం కీలకమని ఎఐటియుసి రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.ఓబులేశు అన్నారు. ఉక్కునగరం సెక్టర్- 9లోని ఆంధ్రకేసరి కళాక్షేత్రంలో రెండురోజులు నిర్వహించిన ఎఐటియుసి యువకార్యకర్తల రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులు మంగళవారం ముగిశాయి. ముగింపు సభలో జి.ఓబులేసు మాట్లాడుతూ, దేశంలో కార్మికవర్గం తీవ్రమైన గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోందన్నారు. ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను మోడీప్రభుత్వం హరిస్తోందని తెలిపారు. మోడీ ప్రభుత్వాన్ని సాగనంపక పోతే రానున్న రోజుల్లో కనీస ప్రజాస్వామిక హక్కులు కూడా కోల్పోయే ప్రమాదముందన్నారు. కార్మికహక్కుల పరిరక్షణకోసం పట్టుదలతో, నిరంతరమూ పోరాటాలను చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్, స్టీల్ యూనియన్ ప్రధానకార్యదర్శి డి.ఆదినారాయణ, అధ్యక్షులు కెఎస్.ఎన్.రావు, ఎ.మసేనురావు, సహాయ కోశాధికారి కె.రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో సంతృప్తి

ప్రజాశక్తి -ములగాడ : సేవా కార్యక్రమాలు సంతృప్తినిస్తాయని ప్రముఖ సంఘ సేవకులు నండూరి వెంకట సీతాకుమారి అన్నారు. జ్ఞానాపురంలోని మదర్ థెరిసా వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఆమె నైటీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా వృద్ధులను, పేదలను ఆదుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఐపిఎస్.భాగ్యలక్ష్మి, సెయింట్ ఆన్స్ ప్రతినిధి సిస్టర్ జానీస్, జాతీయ సేవా పథకం వాలంటీర్ స్రవంతి, మదర్ థెరిసా వృద్ధాశ్రమ నిర్వాహక సిస్టర్స్ పాల్గొన్నారు.

'ఉత్తరం'లో గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు వైసిపి సమన్వయకర్త కెకె.రాజు మంగళవారం పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలువురు వచ్చి సమస్యలతో కూడిన వినతిపత్రాలను కెకె.రాజుకు అందించారు. వినతిపత్రాలను పరిశీలించిన కెకె.రాజు అధికారులతో మాట్లాడి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరికొన్నింటికి సంబంధించి అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

అనధికార నిర్మాణాల తొలగింపు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 23, 25, 27 వార్డుల్లో అనధికారికంగా కట్టిన భవనాలను తొలగించినట్లు ఇన్‌ఛార్జి టిపిఎస్ తేజ తెలిపారు. జివిఎంసి నుంచి అనుమతి తీసుకొని భవన నిర్మాణాలు చేయాలని, లేకుంటే తొలగింపులు తప్పవని ఆయన హెచ్చరించారు. జోన్ పరిధిలో ఎక్కడైనా పోస్టర్లు అతికిస్తే వారికి ఫైన్ విధించడమే కాకుండా, తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'శ్రీచైతన్య'లో ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి- కరాస: జివిఎంసి 52వ వార్డు పరిధిలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో ప్రీ ప్రైమరీ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ చైతన్య విద్యా సంస్థల వైజాగ్ సిటీ రీజనల్ ఇంఛార్జి అహ్మద్ అలీ హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీయడానికి, స్నేహభావం పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపల్ జె.మహేష్ మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్రాభివృద్ధే ధ్యేయంగా శ్రీ చైతన్య కరిక్యులం రూపొందించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రీ ప్రైమరీ ఇంఛార్జి జి.శ్రీవాణి, ప్రైమరీ ఇంఛార్జి బి.సోనియా, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ టీచర్లకు జీతాలు చెల్లించాలి

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నబ్బాయి

ప్రజాశక్తి-అనకాపల్లి

బదిలీల ప్రక్రియ పూర్తయి నెల రోజులు గడుస్తున్నా నేటికీ కొత్త స్థానాల్లో చేరిన ఉపాధ్యాయులకు జీతాలు అందక పోవడం శోచనీయమని, వెంటనే జీతాలు చెల్లించాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ట్రాన్స్‌ఫర్ పొందిన ఉపాధ్యాయులు గత నెల 11న స్కూల్ అసిస్టెంట్లు, 14న జీఎస్టీలు కొత్త పాఠశాలలలో చేరారని తెలిపారు. వీరిలో సుమారు వెయ్యి మంది ఉపాధ్యాయులు రీఅపాయింట్మెంట్ స్థానాల్లో చేరారని పేర్కొన్నారు. వీరందరినీ ఖజానా వెబ్ సైట్‌లో ఆయా పాఠశాలల్లో ఉన్న ప్రస్తుత క్యాడర్ స్ట్రెంత్‌లో చేర్చ వలసి ఉందని తెలిపారు. దానికి గాను ఉమ్మడి విశాఖ జిల్లా విద్యాశాఖ అధికారి నుంచి మూడు జిల్లాల జిల్లా ఖజానా అధికారులకు కొత్త క్యాడర్ స్ట్రెంత్ వివరాలు లేఖ ద్వారా పంపవలసి ఉండగా ఆ ప్రక్రియ నేటికీ పూర్తి కాకపోవడం వల్ల ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారు వెయ్యి మంది వరకు జీతాలు రాని పరిస్థితి నెలకొందని వాపోయారు. ఈ నెల 12వ తేదీ దాటితే ఎరియర్ బిల్లులు పెట్టుకొనే అవకాశం కూడా ఉండదన్నారు. తత్ఫలితంగా సెప్టెంబర్ నెల వరకూ ఉపాధ్యాయులకు జీతాలు అందే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి ఉమ్మడి విశాఖ జిల్లా విద్యా శాఖాధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఉమ్మడి విశాఖ జిల్లా విద్యా శాఖాధికారులు మేల్కొని, వెంటనే కొత్త క్యాడర్ స్ట్రెంత్ వివరాలు ఖజానా వెబ్ సైట్‌లో చేర్పించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని చినబ్బాయ్ డిమాండ్ చేశారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న పడాల్ దాస్

ఎంఇఒగా పడాల్‌దాస్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరపల్లి మండల విద్యాశాఖ అధికారిగా కె.పడాల్‌దాస్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అల్లూరి సీతారామరాజు జిల్లా మంచంగిపుట్ట ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతిపై బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎంఈఓగా పనిచేస్తున్న సిహెచ్ రవీంద్రబాబు చిన్న గదిలి మండలానికి బదిలీ కావటంతో ఈ పోస్టు ఖాళీ అయ్యింది. ఈ పోస్టులో ఎవరిని వెయ్యకపోవటంతో పడాల్ దాస్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన పూర్వ ఎంఈఓ దగ్గర నుంచి బాధ్యతలు స్వీకరించారు. సుమారు 8 ఏళ్ల పాటు ఎంఈఓ గా పనిచేసిన రవీంద్రబాబును పలువురు ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.



పాదయాత్రలో లోకేష్‌తో పైలా ప్రసాదరావు

లోకేష్‌తో కలిసి అడుగులేసిన పైలా

ప్రజాశక్తి- కె.కోటపాడు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర 2000 వేల కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గంలో లోకేష్‌తో కలిసి మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు పైలా ప్రసాదరావు పాదయాత్రలో నడిచారు. కోవూరు నియోజకవర్గం కొత్తపల్లిలో ఆవిష్కరించిన శిలా ఫలకం వద్ద యువగళం పాదయాత్రకు మద్దతుగా పైలా కార్యకర్తలతో కలిసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పైలా ప్రసాదరావు మాట్లాడుతూ అధికార వైసిపి ఎన్ని అడ్డంకులు సృష్టించినా నారా లోకేష్ పాదయాత్ర ప్రభంజనంలా 2 వేల కిలోమీటర్లకు చేరుకోవడం విశేషమని తెలిపారు. పాదయాత్రలో లోకేష్ వాస్తవాలను ప్రజల ముందు ఉంచుతూ అధికార పార్టీ దోపిడీని వివరంగా బట్టబయలు చేస్తున్నారని పేర్కొన్నారు.

ఉరుములు, మెరుపులతో భారీ వర్షం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురం మండలంలో మంగళవారం రాత్రి ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రహదారులపై వర్షం నీరు కాలువలా ప్రవహించింది. ఎండిపోతున్న పంటలకు జీవనం పోసినట్లు ఉందని రైతులు తెలిపారు.

ముమ్మరంగా వ్యవసాయ పనులు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

మండలంలోని పలు గ్రామాలలో సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం వ్యవసాయ పనులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. దీంతో వ్యవసాయ పనుల్లో రైతుల బిజీ అయ్యారు. వరి ఆకు వేసిన తరువాత పలు గ్రామాల్లో ఎండలు తీవ్రంగా కాయడంతో ఆకుమడులలో పైపొర పెంకు కట్టడంతో రైతులు ఆందోళన చెందారు. వర్షం వల్ల ఆకుమడులలో నీరు చేరడంతో ఆకుమడ్లకు ఈ వర్షం ఉపయోగపడుతుందని రైతులు తెలుపుతున్నారు. అలాగే మండలంలోని కందిపూడి, రాజాం, సీతయ్యపేట, పెదపూడి, తురకలపూడి, తదితర గ్రామాలలో సాగు చేయడానికి గతంలో వేసుకున్న గంటి నారుమడులో పెరిగిన గంటి ఆకును మంగళవారం పలు గ్రామాలలో రైతులు నాటడానికి సిద్ధం చేసుకున్నారు.



గంటి నారు సిద్ధం చేస్తున్న రైతు

కూల్చివేతలే తప్ప అభివృద్ధి పట్టదా..?

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

వైసిపి నాయకులకు విధ్వంసమే తప్ప అభివృద్ధి అవసరం లేదని మాజీ శాసనసభ్యులు కెఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. మండలంలోని నేతవానిపాలెం గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి వైసీపీకి చెందిన వైస్ ఎంపీపీ గోంప చినబాబు ధ్వంసం చేసి, మట్టితో కప్పివేసిన మంచినీటి బావిని మంగళవారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్యబాబు, గ్రామస్తులతో కలిపి మాజీ ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాతల తండ్రుల నుండి నేతవానిపాలెం, దిబ్బిడి గ్రామాల ప్రజలు లచ్చన్ననూతి నీటిని వినియోగించుకుంటున్నారని, అలాంటి తాగునీటి బావిని పూడ్చి పెట్టడం దారుణమన్నారు. అనంతరం గ్రామస్తులతో కలిసి పాదయాత్రగా ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి, అక్కడ ధర్నా చేశారు. ఎంపీడీవో సువర్ణరాజు అందుబాటులో లేకపోవడంతో మాజీ ఎమ్మెల్యే రాజు ఆయనతో ఫోన్లో మాట్లాడారు. తాగునీటి బావిని వెంటనే పునరుద్ధరించాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ డొంకిన అప్పలనాయుడు, టిడిపి గ్రామ అధ్యక్షులు గాడి సూరి అప్పారావు, సుంకర శ్రీనివాసు, వార్డు సభ్యులు వియ్యపు రాము, మాజీ ఎంపీటీసీ గోన్నబత్తుల శ్రీనివాసరావు, ముమ్మిన సూర్యనారాయణ, ద్వారపురెడ్డి శంకర్రావు, వియ్యపు రాజు, బర్నికాన నాయుడు, దేవుళ్ళు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



తాగునీటి బావి పూడ్చివేయడంపై ఆందోళన చేస్తున్న నేతవానిపాలెం గ్రామస్తులు

నాడు-నేడు పనులు వెంటనే పూర్తి చేయాలి



మాట్లాడుతున్న డిఇఒ వెంకట లక్ష్మమ్మ

ప్రజాశక్తి-చోడవరం

నాడు నేడు పనులను ఎటువంటి అలసత్వం లేకుండా వెంటనే పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ ఆదేశించారు. మంగళవారం చోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో గల ఎనిమిది మండలాల మండల విద్యాశాఖాధికారులు, మనబడి నాడు నేడు ప్రధానోపాధ్యాయులు, ఫీల్డ్ ఇంజనీర్లు, సిఆర్‌పిలు, ఎమ్మైస్ కోర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న విద్యా కానుక కిట్లను అన్ని పాఠశాలలకు అందేలా చూడాలని, ఉపాధ్యాయులందరూ సక్రమంగా టైముకు పాఠశాలకు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ రవిబాబు, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ సత్యప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నారాయణ రావు, ఏ.పిఇ.డబ్ల్యుసి డివిజనల్ ఇంజనీర్ ప్రసాద్, చోడవరం మండల విద్యాశాఖాధికారి -1 జయలక్ష్మి, మండల విద్యాశాఖాధికారి -2 సింహాచలం పాల్గొన్నారు.

ఆటోమేటిక్‌గా అలెర్ట్ చేసే పరికరం రూపకల్పన

ప్రజాశక్తి-అనకాపల్లి : విద్యుత్తు సరఫరా నిలిచిపోగానే ఆటోమేటిక్‌గా లైట్ వెలిగి అలెర్ట్ చేసే పరికరాన్ని అనకాపల్లి జిల్లా దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థినులు రూపొందించారు. కళాశాల ఈఈఈ డిప్లొమా చదువుతున్న విద్యార్థినులు నిహారిక, భూమిక, రత్నకుమారి రూపొందించిన ఈ పరికరాన్ని మంగళవారం పరికరాన్ని ప్రదర్శించి వివరాలు తెలియజేశారు కరెంట్ పోయినపుడు ఈ పరికరానికి అమర్చిన బ్యాటరీ ద్వారా లైట్లు వెలుగుతాయని, అలెర్ట్ సౌండ్ చేస్తుందని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ చెయ్యడానికి రూ.600 ఖర్చు చేసినట్లు ప్రాజెక్ట్ ఇంజినీర్ బి. శేషగిరి రావు తెలిపారు. దీనికి గైడ్‌గా జె.శివ వ్యవహరించారు. కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్, ఇంఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, డీన్ అకాడమిక్స్ డాక్టర్ కె.పార్వతి, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ గోపాలమ్మ విద్యార్థులను అభినందించారు.



తయారు చేసిన ప్రాజెక్టుతో విద్యార్థులు



సర్వేలో పాల్గొన్న వైద్య సిబ్బంది

కొండుపాలెంలో హెల్త్ సర్వే

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో వున్న కొండుపాలెం గ్రామంలో ఈ నెల 8 నుండి 11వ తేదీ వరకు నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే నిర్వహించారు. గ్రామంలో కొన్ని కుటుంబంలోని వ్యక్తుల సంక్షేమం, ఆరోగ్య సమాచారం సేకరించి వారికి రక్తపోటు, మధుమేహం, ఎత్తు, బరువు పరీక్ష చేశారు. ఈ సర్వేని సెంట్రల్ గవర్నమెంట్ తరపున సిగ్మా రీసెర్చ్ సంస్థ నిర్వహించిందని టీం లీడర్ ఆర్.తారకాచారి, ఏడుగురు బృంద సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో జమ్ము శ్రీనివాసరావు, ఎమ్ఎల్‌హెచ్‌పి ఎం.శాంతి, ఎంపిహెచ్ఎ కె.సుమిత్ర, ఎన్ రాము, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ద్వారా ఉచిత సేవలు

ప్రజాశక్తి - పరవాడ

జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజలకు ఉచితంగా సేవలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ అన్నారు. మండలంలోని గొర్లివానిపాలెం గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ గొర్లి గోపి అమ్మలు వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి అదీప్‌రాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, వైసిపి నాయకులు చుక్క రాము నాయుడు, కోన రామారావు, వెన్నెల సన్యాసిరావు, ఎంపీటీసీ గొర్లి వరలక్ష్మి ఎరుకు నాయుడు, ఉప సర్పంచ్ రామరావు, తహసీల్దార్ కనకరావు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : జగనన్న సురక్ష ప్రజలకు శ్రీరామ రక్షణ నిలుస్తుందని ఎంపిపి గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలోని చింతనిప్పుల అగ్రహారం, కొత్తూరు, కూండ్రం గ్రామ సచివాలయాల్లో మంగళవారం జగనన్న సురక్షపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.వి నరసింహారావు, ఈఓపిఆర్డి ధర్మారావు, వైసిపి నాయకులు సేనాపతి పెంటరావు , యలమంచిలి చినరమణ, మొల్లి గంగునాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి గొర్లి సూరిబాబు


విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

వరి విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలో పెదపాడు గ్రామంలో మంగళవారం రైతులకు మండల పరిషత్ అధ్యక్షులు కోన సంధ్యా లచ్చన్న నాయుడు, సర్పంచ్ జనపరెడ్డి అరుణా రమేష్ చేతుల మీదుగా వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలలో రైతులకు కావలసిన వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. మండల వ్యవసాయ అధికారి శంకర్ గోవింద వ్యవసాయ విస్తరణాధికారి కాండ్రేగుల సూర్యనారాయణ పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు రుణాల పంపిణీ

ప్రజాశక్తి -కశింకోట : కశింకోట వెలుగు కార్యాలయంలో స్వయం సహాయక సంఘాలు సభ్యులకు మంగళవారం రూ.12 లక్షల రుణాలు పంపిణీ చేశారు. కశింకోట మహిళ సమాఖ్య ద్వారా తాళ్లపాలెం, ఉగ్గినపాలెం, జమ్మదులపాలెం గ్రామాల స్వయం సహాయక సంఘాల సభ్యులకు వీటిని అందజేశారు. కార్యక్రమంలో మహిళ సమాఖ్య అధ్యక్షులు కె అరుణ, సెక్రటరీ లక్ష్మీ, ఏపిఎం ఎస్.శ్రీనివాసరావు, సీసీ రామకృష్ణ పాల్గొన్నారు.

ఉపాధి హామీ లబ్ధిదారులతో సమీక్ష

ప్రజాశక్తి- కశింకోట : ఉపాధి హామీ పథకం సంచాలకులు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఇ సందీప్ కసింకోట మండలంలోని యన్జి పాలెం పంచాయతీలో ఉపాధి హామీ లబ్ధిదారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యస్సి, యస్టి సభ్యులు ఎంత మంది వస్తున్నారు, ఎంతమంది రావటం లేదు, రాకపోవడానికి కారణాలు ఏమిటి? ఏమైనా పత్యామ్నాయ ఉపాధి అవకాశాలు ఉన్నాయా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత ఎన్జీ పాలెం ఎస్సీ ఎస్టి కాలనీలో పర్యటించి అక్కడ ఉన్న వేతనదారులతో పనిలో రాకపోవడానికి కారణాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎపిడి రోజారాణి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ ప్రశ్నలకు సమాధానమేదీ ?

ప్రజాశక్తి-అనకాపల్లి : జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ లేవనెత్తిన అంశాలకు సమాధానం ఏదని ఆ పార్టీ నాయకులు దూలం గోపి, శ్రీరాందాస్ గోవింద్, తాడి రామకృష్ణ, మళ్ల శ్రీను ప్రశ్నించారు. మంగళవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కాగ్ లెక్కల ప్రకారం రూ.1.18 లక్షల కోట్లు, ఏపీ స్టేట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ తెచ్చిన రుణం రూ.22504 కోట్లు, రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా అప్పు తెచ్చిన రూ.4,754 కోట్లు ఖర్చుపై పవన్ కళ్యాణ్ అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం నుంచి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వివిధ శాఖల కింద ఖర్చు చేసినట్లు చెబుతున్న లెక్కలకు చేసిన ఖర్చులకు పొంతన లేదన్నారు. ఈ సమావేశంలో బర్నికాన రాము, అప్పికొండ గణేష్, సీత, కాండ్రేగుల ప్రసాద్, లక్ష్మణ్, శ్యామ్, సాయి పాల్గొన్నారు.

బీజామృతం ద్వారా విత్తన శుద్ధితో మేలు

ప్రజాశక్తి-అనకాపల్లి : బీజామృతం ద్వారా విత్తన శుద్ధి చేసి అధిక ఉత్పత్తి సాధించాలని ఐసిఆర్పిలు సిహెచ్ రామలక్ష్మి, ఆర్ లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని రొంగలివాని పాలెం గ్రామంలో మంగళవారం ఏపీసీఎంఎఫ్ ఆధ్వర్యంలో బీజామృతంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజామృతంతో చీడ పీడలు నివారణ అవుతాయన్నారు. అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

పారదర్శకంగా కొత్త ఓటర్ల నమోదు

ప్రజాశక్తి-కె.కోటపాడు : ఓటర్ జాబితాలను పారదర్శకంగా చేపట్టాలని, ఎటువంటి అక్రమాలకు చోటు లేకుండా చూడాల్సిన బాధ్యత బూత్ లెవెల్ అధికారులదేనని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత అన్నారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో బిఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 26 నుండి వచ్చే నెల 26వ తేదీ వరకు ఓటర్ దరఖాస్తులపై ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే ఓటర్ల విషయంలో అప్రమత్తత అవసరమని తెలిపారు. తొలగింపులు, అడ్రస్ మార్పులు, వలస వెళ్లే వారి వివరాలపై కచ్చితమైన సమాచారం సేకరించాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక తహసీల్దార్ రమేష్ బాబు పాల్గొన్నారు.

పలుచోట్ల జనాభా దినోత్సవం

ప్రజాశక్తి -భీమునిపట్నం

స్థానిక ఎస్విఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. డిపార్ట్మెంట్ ఆఫ్ ఎకనామిక్స్, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యాన కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఎకనామిక్స్ విభాగాధిపతి డాక్టర్ ఎం.రమణ మాట్లాడుతూ, ప్రపంచ జనాభాలో భారత దేశ జనాభా 16 శాతంగా ఉందన్నారు. జనాభా పెరుగుదలతో ఆర్థిక అసమానతలు, నిరుద్యోగ సమస్య అధికమౌతాయని తెలిపారు. భారతదేశ వృద్ధి రేటుపై తీవ్ర ప్రభావం చూపుతుందని స్పష్టం చేశారు. ఇంఛార్జి ప్రిన్సిపల్ జి అనురామ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఐక్యూ ఎసి కో-ఆర్డినేటర్ మాధురి, ఆర్ ఉమామహేశ్వరరావు, జెకెసి కో-ఆర్డినేటర్ ఎం.రాజేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ 1,2,3 విభాగాల పిఒలు డాక్టర్ సిహెచ్.జ్యోతి, డాక్టర్ ఎస్.అప్పలనాయుడు, ఎన్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేక్ షహనాజ్ శాధియా మాట్లాడుతూ, అధిక జనాభా దేశ ప్రగతికి అవరోధంగా ఉంటుందన్నారు.

సీతమ్మధార : ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా రామాటాకీస్ సమీపంలోని జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయం నుంచి చేపట్టిన ర్యాలీని డిఎంఅండ్ హెచ్ఒ పి.జగదీశ్వరరావు ప్రారంభించారు. ర్యాలీ సత్యం జంక్షన్ వరకు వెళ్లి తిరిగి కార్యాలయానికి చేరుకుంది. ర్యాలీలో కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటిద్దామని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డిఎంఅండ్ హెచ్ఒ మాట్లాడుతూ, భారతదేశ జనాభా 142 కోట్లతో మొదటి స్థానానికి చేరిందని తెలిపారు. ఈ ర్యాలీలో ప్రోగ్రామ్ అధికారులు, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, వైద్య ఆరోగ్య కార్యాలయ సిబ్బంది, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

మాడుగుల: సాంకేతిక, మానవ వనరుల ఉపయోగంతో దేశాభివృద్ధి సాధించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శాస్త్రి సూచించారు. మంగళవారం కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచంలో భారతదేశం అత్యధిక జనాభా కలిగి ఉండడం అభినందనీయమన్నారు. కానీ మానవ వనరులు, సాంకేతిక వినియోగించినప్పుడే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ అధిక జనాభా కారణంగా కాలుష్యం, ఆహార కొరత ఏర్పడుతుందని దీనిని అధిగమించాలని సూచించారు. తెలుగు అధ్యాపకులు పైడిరాజు మాట్లాడుతూ యువత అన్ని రంగాలలో అభివృద్ధి సాధించినపుడే ప్రపంచంలో భారత్ అగ్రస్థానంలో నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇతర అధ్యాపకులు శిరీష, షర్మిల, రాజు ఎన్ఎస్ఎస్ పిఓ రామ్ కుమార్ పాల్గొన్నారు.


కశింకోటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ర్యాలీ

కశింకోట : ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా డాక్టర్ ఎస్ తిరుపతి రావు ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా ఆరోగ్యంగా ఉండేలా కృషి చేయాలన్నారు. అందరికీ వైద్య సదుపాయాలు అందాల, అన్ని రకాలుగా అభివృద్ధి చెందడానికి కృషి చేసినప్పుడే దేశం బాగుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్పిహెచ్యస్ సత్యన్నారాయణ, సత్యవతి, సూపర్వైజర్లు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే రమణమూర్తిరాజు జన్మదిన వేడుకలు


కేక్ తినిపిస్తున్న వైసిపి జిల్లా అధ్యక్షులు ప్రసాద్

ప్రజాశక్తి -మునగపాక రూరల్

యలమంచిలి ఎమ్మెల్యే యువి.రమణమూర్తి రాజు 72వ జన్మదిన వేడుకలు మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, జెడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎంపిపి మళ్ల జయలక్ష్మి, వైసీపీ నాయకులు ఆడారి గణపతి అచ్చం నాయుడు, పాలిమేర పూర్ణచంద్ర గణేష్, సర్పంచ్లు దిమ్మల అప్పారావు, కాండ్రేగుల నూకరాజు, బొడ్డేడ శ్రీనివాసరావు, సుందరపు తాతాజీ, బీసెట్టి గంగ అప్పలనాయుడు, వివిధ గ్రామాల ఎంపిటిసీలు పాల్గొన్నారు.

యలమంచిలి రూరల్ : ఎమ్మెల్యే రమణమూర్తి రాజు పుట్టిన రోజు వేడుకలు సందర్భంగా వివిధ గ్రామాల సర్పంచులు, వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు వచ్చిన ఆయన్ను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో రోగులకు పండ్లు, బ్రెడ్, పంపిణీ చేశారు. పలు చోట్ల మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీపీ బోద్దేపు గోవిందు, మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు, ఆరేపు గుప్త, వైసీపీ నాయకులు బొద్దపు ఎర్రయ్య దొర, కౌన్సిలర్లు దాసరి కుమార్ చిన్నమ్ములు, దుంగ అచ్యుతరావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : ఎమ్మెల్యే పుట్టిన రోజు సందర్భంగా స్థానిక వైసిపి కార్యాలయంలో కేక్ కట్ చేశారు. కన్నబాబు రాజుకు ఫోన్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మండల వికలాంగుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు రూ.10వేలు విలువ చేసే ఫ్రూటీలు, బిస్కెట్లు అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు దేశంశెట్టి శంకర్రావు, కోన లచ్చన్న నాయుడు, నర్లా కుమార్, లాలం రాంబాబు, పిన్నమరాజు వాసు, కే విమల నాయుడు పాల్గొన్నారు.

నాణ్యమైన పశుగ్రాసంతో అధిక పాల దిగుబడి


ప్రజాశక్తి -కశింకోట : నాణ్యమైన పశు గ్రాసంతో అధిక పాల దిగుబడి వస్తుందని కసింకోట పశువైద్యాధికారి డాక్టర్ అల్పహన్స్ జార్జ్ అన్నారు. పశు గ్రాస వారోత్సవాలు కసింకోట గ్రామంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడి రైతులకు పశుగ్రాస సాగు, వివిధ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు. పశువులకు అందించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు బుచ్చిబాబు, రైతులు పాల్గొన్నారు.

రాయితీపై పశుగ్రాస విత్తనాలు

ప్రజాశక్తి- కె.కోటపాడు : పశుగ్రాస వారోత్సవాల సందర్భంగా రైతులకు 75శాతం రాయితీపై పశుగ్రాస విత్తనాలు అందిస్తున్నామని పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ జి బైరాగి తెలిపారు. మంగళవారం సింగన్న దొరపాలెం గ్రామంలో రైతులతో మాట్లాడుతూ మేలు జాతి పశుగ్రాసాలు వాడటం వల్ల పశువులు అధిక పాల దిగుబడి ఇస్తాయని తెలిపారు. ప్రతి రైతు భరోసా కేంద్రాల్లో మొక్కజొన్న, కాకిజొన్న విత్తనాలు అందుబాటులో ఉంచామని చెప్పారు. ఐదు కేజీల కాకి జొన్న రూ.115, ఐదు కేజీల మొక్కజొన్న రూ.85కు ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. పొలం గట్ల పైన వృధాగా ఉన్న భూముల్లో వేసి మేలైన ప్రసుగ్రాసాన్ని

గంజాయి నిందితులపై పీడీ యాక్ట్

ప్రజాశక్తి- కె.కోటపాడు : గంజాయి రవాణా చేస్తున్న వారిపై పీడీ యాక్ట్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటున్నామని అనకాపల్లి డిఎస్పి వి సుబ్బరాజు అన్నారు. మండలంలోని ఎ కోడూరు పోలీస్ స్టేషన్లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈఏడాది ఎ కోడూరు పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు గంజాయి కేసుల నమోదు చేసి పదిమంది ముద్దాయిలను అరెస్టు చేసినట్లు చెప్పారు. మంగళవారం ఉదయం అల్లూరు జిల్లా గోరాపూర్ రైల్వే స్టేషన్ సమీపంలో ఒడిశా రాష్ట్రం మల్కన్ గిరి నుండి మధ్యప్రదేశ్కు గంజాయి తరలిస్తున్న వారిని ఎ కోడూరు ఎస్సై రామకృష్ణ అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. గత నెల 29న వారాడ జంక్షన్ వద్ద కారులో 110 కేజీల గంజాయి తరలిస్తున్న దేవానంద్ పాండా, కన్నా సాహులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఎ3 ముద్దాయి మధు ముదిలిని ముంచింగిపుట్టు సమీపంలో అరెస్టు చేశామన్నారు. మొత్తం గంజాయి రవాణా దారులను చాకచక్యంగా అరెస్టు చేసిన ఎ కోడూరు ఎస్ఐ రామకృష్ణను సిఐ తాతారావులను డిఎస్పి అభినందించారు.


వంగవీటి రంగ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నరేంద్ర

వంగవీటి రంగా విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి -వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో వంగవీటి మోహన్రంగ విగ్రహాన్ని రాష్ట్ర రంగా-రాధా మిత్రమండలి అధ్యక్షుడు వంగవీటి నరేంద్ర మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంగవీటి మోహనరంగా అందరివాడని, పేద బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచారని తెలిపారు. పేదల గుండెల్లో వంగవీటి రంగ ఇప్పటికీ దైవంలా నిలిచారన్నారు. వంగవీటి గురించి సోషల్ మీడియాలో ఎవరైనా తప్పుడు పోస్టులు పెడితే వారి తాటతీస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్సి కరణం ధర్మశ్రీ, వైస్ ఎంపిపి దొండా నారాయణ మూర్తి, జెడ్పిటిసి దొండా రాంబాబు, టిడిపి నియోజకవర్గం ఇన్ఛార్జి బత్తుల తాతయ్య బాబు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి- సబ్బవరం : ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ అన్నారు. మండలంలోని సబ్బవరం సచివాలయం-1 పరిధిలో మంగళవారం ఆయన స్థానిక వైసీపీ నాయకులతో కలిసి పర్యటించారు. స్థానిక పశు వైద్యశాల లో నూతనంగా నిర్మించిన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమం చేపట్టలేదన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పి వైస్ చైర్మన్ తంపాల అప్పారావు, ఎంపిపి బోకం సూర్యకుమారి రాము నాయుడు, ఎంపీడీవో రమేష్ నాయుడు, ఎంపీటీసీలు బయలుపూడి దేముడుబాబు, వై.రాము, వైసిపి నాయకులు కర్రి బాబు, కోటాన రాము, ధనమిరెడ్డి శ్రీనివాసరావు, మండల లక్ష్మణ, బంతి కోళ్ల పద్మ, దేద్దం పద్మావతి కావుశెట్టి శేషుబాబు, పల్లా కృష్ణ, సబ్బువరపు ముత్యాలనాయుడు ఇతర నాయకులు పాల్గొన్నారు.

జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్గా ఎల్వి.రమణ

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్గా ఎల్వి రమణను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు ఆయన మంగళవారం విధుల్లో జాయిన్ అయ్యారు. ఆయనకు కోచులు ఎం అచ్యుతారావు, పివి నాగేశ్వరరావు, ఎన్వివిఎస్ రమేష్ జి రాంబాబు, కె త్రిమూర్తులు, ఆఫీస్ ఇంచార్జ్ వేణుగోపాలరావు శుభాకాంక్షలు తెలియజేశారు.

13న మరిడిమాంబ పండగ

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో కొలువై ఉన్న మరిడిమాంబ అమ్మవారి పండుగను ఈనెల 13వ తేదీ గురువారం నిర్వహించనున్నారు. ఆలయానికి రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దారు. అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ ప్రతినిధి అమిరిపిల్లి సత్తిబాబు తెలిపారు.

సమస్యలను పరిష్కరించని సమావేశాలెందుకు?

పలువురు సభ్యులు నిరసన, ఆగ్రహం : రావికమతం మండల సర్వసభ్య సమావేశం



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

ప్రజాశక్తి - రావికమతం : సభ్యులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించలేని పరిస్థితుల్లో మండల సమావేశాలను నిర్వహించి ప్రయోజనమేమిటని పలువురు ఎంపిటిసిలు, సర్పంచ్‌లు ప్రశ్నించారు. మంగళవారం ఎంపిపి పైలా రాజు అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంఆ రావికమతం పిహెచ్‌సిలో కాన్పులకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు, మందులను ఇవ్వడం లేదని ఎంపిపిపైలరాజుతో పాటు పలువురు సభ్యులు వైద్యాధికారిని నిలదీశారు. మర్రివలస నుంచి గొల్ల కొంపలు వరకు 1500 మీటర్ల తారు రోడ్డు నిర్మాణానికి రూ.1.15కోట్లు నిధులు మంజూరైనా, పనులు చేపట్టకుండడా పలువురు అడ్డుతగులుతున్నారని మర్రివలస ఎంపిటిసి లోవరాజు సభ దృష్టికి తేగా, ఎమ్మెల్యే ధర్మశ్రీ స్పందించి, సమస్య పరిష్కారానికి సత్వరమే చర్యలు చేపట్టాలని తహశీల్దార్ ఉమామహేశ్వరరావు, ఎంపిడిఒ వెంకన్న బాబులను ఆదేశించారు. ఉమ్మడి పంచాయతీగా ఉన్న కన్నంపేట, వొమ్మవరం విభజించిన నేపథ్యంలో, దానికి అనుగుణంగా ఏయే గ్రామాలకు ఏయే చెరువులు, రెవెన్యూ ఆయకట్టు వస్తుందో విభజించి గ్రామాల్లో సమస్యలు లేకుండా చూడాలని వొమ్మవరం సర్పంచ్ సంజీవ్ సభ దృష్టికి తెచ్చారు. గతంలో పలుమార్లు అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తట్టబంద పంచాయతీలో విద్యుత్ సమస్యలు తీవ్రమైనా స్పందన లేనది సర్పంచ్ గోకివాడ రమణ విన్నవించారు. సమస్యలను పరిష్కరించలేనపుడు తమను ఎందుకు ఆహ్వానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తట్టబంద పంచాయతీలో ట్రాన్స్‌ఫార్మర్లు, స్విచ్‌లు సరిగా లేక పలుమార్లు ప్రమాదాలు జరిగాయని అధికారులకు విన్నవించినా స్పందించడం లేదని, కరెంటు ఎపుడొస్తుందో, ఎంతసేపు ఉంటుందో కూడా తెలియని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు స్తంభాలు, విరిగిపడినా పట్టించుకోలేదని, దాదాపు 22 వీధిదీపాలు పాడైనా కన్నెత్తి చూసే దిక్కులేదని ఆరోపించారు. పలు సమస్యలను లేవనెత్తినా, వాటికి పరిష్కార చర్యలేమిటో స్పష్టం చేయకుండా అయోమయంగా మండల సమావేశం ముగిసింది.కార్యక్రమంలో వైస్ ఎంపిపి రమణ, భవానీ ప్రసాదు, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ముక్కా మహాలక్ష్మి నాయుడు పాల్గొన్నారు.

దేవుడు సేవలు స్ఫూర్తిదాయకం



దేవుడిని సత్కరిస్తున్న సిపిఐ నేతలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మాకిరెడ్డి దేవుడు సేవలు స్ఫూర్తిదాయకమని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి అన్నారు. 98 ఏళ్ల వయసులో కూడా అలుపెరగని పోరాటాలు చేసిన దేవుడిని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలనిపిలుపునిచ్చారు. మంగళ వారం స్థానిక కృష్ణ ప్యాలెస్‌లో దేవుడికి ఘన సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాకిరెడ్డి దేవుడు ఉద్యమ స్ఫూర్తిని కొనియాడారు. వ్యవసాయ కార్మిక సంఘం పోరాటాలకు, సిపిఐ పోరాటాలకు, ఆయన చేసిన సేవలు ఎనలేనివన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రావు జగ్గారావు అధ్యక్షతన జరిగిన విశాలాంధ్ర పత్రిక సంపాదకులు వెంకటేశ్వర్లు, సిపిఎం రాష్ట్ర నాయకులు నర్సింగరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, అల్లూరు జిల్లా నుంచి పొట్టిక సత్యనారాయణ, పైడిరాజు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, గురుబాబు, గంగాభవాని, క్రాంతి పాల్గొన్నారు.

అమ్మఒడి నిధులకు అగచాట్లు

కొందరికే అందిన ప్రభుత్వ ప్రోత్సాహకం



లింగాపురం మినీ బ్యాంకు వద్ద బారులు తీరిన మహిళలు

ప్రజాశక్తి -కోటవురట్ల: అమ్మఒడి పథకం కింద ప్రభుత్వం విద్యార్థుల తల్లుల ఖాతాలో జమచేసిన డబ్బులు పొందేందుకు నానా అగచాట్లు పడుతున్నారు. పక్షం రోజులు కావస్తున్నా నేటికీ అందకపోవడంతో బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ ఉన్నారు, కొందరికి ఖాతాలో డబ్బు జమ కాకపోవడంతో మండల వ్యాప్తంగా బ్యాంకులతో పాటు మినీ బ్యాంకులు చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంటుంది, దీంతో గ్రామీణ ప్రాంత మహిళలు పొలం పనులు మానుకొని, బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. బ్యాంకు ఖాతాల్లో వేసిన అమ్మఒడి డబ్బులు విత్‌డ్రాకు సహకరించండంతోపాటు ఇప్పటివరకు తల్లుల ఖాతాల్లో జమకాని అమ్మఒడి నిధులను వేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

గుంతలో దిగబడ్డ లారీ

ట్రాఫిక్‌కు అంతరాయం



లారీని బయటకు తీస్తున్న ప్రొక్లెయినర్

ప్రజాశక్తి-మాడుగుల : వడ్డాది పాడేరు ప్రధాన రహదారి ఎం కోటపాడు వద్ద గుంతలుగా మారిన ప్రధాన రహదారిలో ఒక లారీ దిగబడి ,ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. చోడవరం వైపు వెళుతున్న లోడు లారీ సోమవారం అర్ధరాత్రి ఎం కోటపాడు వద్ద రోడ్డు గోతుల్లో కూరుకుపోయింది.డ్రైవర్ ఎంత ప్రయత్నించినా బయటకు రాలేదు. దీంతో ప్రధాన రహదారిలో వాహనాల రాకపోకలు ఉదయం వరకు నిలిచిపోయాయి. ఉదయం జెసిబి సహాయంతో గోతుల్లో దిగబడిన లారీని బయకు తీయడంతో ట్రాఫిక్ క్లియర్ అయ్యింది. నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు కృషి మేరకు వివిధ రహదారుల నిర్మాణాలు జరిగినా, ప్రధాన రహదారుల నిర్మాణం జరగలేదు.దీంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు.

శాకాంబరిగా మోదకొండమ్మ

ప్రజాశక్తి.-మాడుగుల: మండల కేంద్రంలో మోదకొండమ్మ అమ్మవారు మంగళవారం శాకాంబరిగా దర్శనమిచ్చారు అమ్మవారిని పలు రకాల కూరగాయలు పండ్లుతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చిన భక్తులు గుడి వద్ద బారులు తీరారు శాకాంబరి అవతారంలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు

లోకేష్ పాదయాత్రకు సంఘీభావ ర్యాలీలు



యువగళం సంఘీభావ పాదయాత్రలో పాల్గొన్న తెలుగు మహిళ అనిత

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : యువగళం పాదయాత్ర రెండు వేల కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం రామ్‌నగర్‌లోని టిడిపి కార్యాలయం నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు ఆ పార్టీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ దక్షిణ నియోజకవర్గం ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి నజీర్ పాల్గొన్నారు.

రోలుగుంట : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, లోకేష్ యువగళం పాదయాత్ర రెండువేల కిలోమీటర్లు పూర్తి చేసిన సందర్భంగా చోడవరం మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు ఆధ్వర్యంలో మంగళవారం ఎంకె.పట్నం నుండి వడ్డిప వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో సిఎం జగన్‌రెడ్డి పాలనలో వైసిపి ప్రభుత్వం అరాచకాలు, అకృత్యాలు, వేధింపులు, వైఫల్యాలను ఎండగడుతూ లోకేష్ పాదయాత్ర రెండు వేల కిలో మీటర్లు పూర్తిచేసి, ముందుకు సాగుతున్నారన్నారు. రాష్ట్రంలో రానున్నది టిడిపి ప్రభుత్వమేనని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు.రైతు నాయకులు మల్లు నాయుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బత్తుల తాతబబు, మండల నాయకులు మడ్డు నాయుడు, గుమలూరు చంద్రమౌళి, పంచాడ చంద్ర, ఒనుం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నక్కపల్లి : లోకేశ్ యువగళం పాదయాత్ర రెండువేల కిలోమీటర్లు చేరిన సందర్భంగా సంఘీభావంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గొడిచెర్లలో పాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, పాదయాత్రలో ప్రతి ఒక్కరికీ ముద్దులు పెట్టి, ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి మాట నిలబెట్టుకోక, మడమ తిప్పి ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారనితెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఆరోపించారు. లోకేశ్ యువగళం పాదయాత్ర వైసిపి శ్రేణుల్లో ప్రకంపనలు సృష్టిస్తోం దన్నారు. చంద్రన్న సీఎం కావాలని ప్రజలంతా కోరుకుంటు న్నారని, త్వరలో అది సాకారం కాబోతుం దన్నారు. కార్యక్రమంలో నక్కపల్లి, ఎస్.రాయవరం, పాయకరావుపేట మండలాల టిడిపి అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేశ్, అమలకంటి అబద్దం, పెదిరెడ్డి చిట్టిబాబు, కొప్పిశెట్టి కొండబాబు, నాయకులు కురందాసు నూకరాజు, లాలం కాశీనాయుడు, కొప్పిశెట్టి బుజ్జి, పెదిరెడ్డి శ్రీను, నానేపల్లి రాఘవులు, గింజాల లక్ష్మణరావు, చంటి, వెలగా శ్రీను, మేరుగు నాగేశ్వరరావు, గోసల చినతా తారావు, రమాకుమారి, ఆకేటి శాంతి, గోసల శ్రీకాంత్, జగదీశ్వరరావు,వాసు పాల్గొన్నారు.

యువగళానికి మంచి స్పందన : బండారు

పెందుర్తి : యువగళానికి మంచి స్పందన వస్తోందని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. లోకేష్ పాదయాత్ర 2000 కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా టిడిపి నాయకులు నాయుడుతోట నుంచి పెందుర్తి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, లోకేష్ పాదయాత్ర ద్వారా ప్రజలు సమస్యలు తెలుసుకొంటున్నారని, టిడిపి అధికారంలోకి రాగానే వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. వైసిపి హయాంలో భూకబ్జాలు ఎక్కువయ్యాయని ఆరోపించారు. వాలంటీర్ల వల్ల మిస్సింగ్‌లు ఎక్కువ జరిగాయని పవన్ కల్యాణ్ ఆరోపిస్తే ఆయన మీద ఎదురుదాడి చేస్తున్నారని, తమ ఏరియాలో కూడా ఇటువంటి మిస్సింగులు ఉన్నాయని పేర్కొన్నారు. జగన్మోహన్‌రెడ్డి వల్ల రాష్ట్రం నాశనమైందని, ప్రజలంతా ఈ విషయాన్ని గమనించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 94వ వార్డు కార్పొరేటర్ జి.శ్రీనివాసరావు, 97వ వార్డు కార్పొరేటర్ వసంత 96వ వార్డు కార్పొరేటర్ పిలా శ్రీనివాసరావు, టిడిపి నాయకులు అవగడ్డ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట :టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 2000 కిలో మీటర్లు పూర్తయిన సందర్భంగా ఆ పాదయాత్రకు సంఘీభావంగా మంగళవారం సాయంత్రం ర్యాలీ కశింకోటలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పీలా గొవింద సత్యనారాయణ మాట్లాడుతూ లోకేష్ పాదయాత్రతో జగన్ రెడ్డి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కాయల మురళి, ఉగ్గిన రమణ మూర్తి, మాధంశెట్టి నీలబాబు, మళ్ళ సురేంద్ర, గొంతిన శ్రీనివాసరావు, వేగి గోపీకృష్ణ, కాండ్రేగుల సతీశ్ కుమార్, వేగి వెంకట రావు, తాకాసి కృష్ణా పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని రైవాడ నుంచి దేవరాపల్లి మండల కేంద్రం వరకు యువగళం పాదయాత్రకు సంఘీభావంగా మంగళవారం టిడిపి నాయకులు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గం కన్వీనర్ పివిజి.కుమార్ మాట్లాడుతూ లోకేశ్ ప్రజల కష్టాలను తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నారని తెలిపారు. పార్టీ నాయకులు పి.సత్యవతి, పోతల పాత్రునాయుడు, కసిరెడ్డి అప్పలనాయుడు, చల్లా నానాజీ, గుల్లిపల్లి అర్జునరావు, కోమారా బాబురావు, బండారు అప్పలనాయుడు, జూరెడ్డి రాము, చింతా సాంబమూర్తి, తమడాన ప్రసాదరావు పాల్గొన్నారు.

పాడేరు ఘాట్ రోడ్డులో ప్రమాదం

పరవాడకు చెందిన బైకిస్ట్ దుర్మరణం

ప్రజాశక్తి పాడేరు: పాడేరు ఘాట్‌లోని మోదకొండమ్మ పాదాలు సమీపంలో వ్యూపాయింట్ వద్ద ఎదురుగా వస్తున్న ఆర్‌టిసి బస్సును బైక్ ఢీ కొట్టిన ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. పరవాడ మండలం ముత్యాలమ్మ పాలెం గ్రామానికి చెందిన సతీష్ అనే యువకుడు తన స్నేహితులతో కలిసి బైక్‌పై వెళుతుండగా ఈ ప్రమాదం సంభవించింది. బస్సును ఢీకొనడంతో బైక్ డ్రైవింగ్ చేస్తున్న సతీష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. సతీష్ మృతదేహాన్ని పోస్టుమార్టానికి పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించి నట్లు స్థానిక ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఐదో రోజుకు అణుకు గిరిజనుల దీక్షలు

ఆకులు కట్టుకుని వినూత్న నిరసన



ఆకులు కట్టుకుని వినూత్నంగా నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి -కోటవురట్ల: అణుకు గ్రామానికి రోడ్డు, పాఠశాల నిర్మాణం చేపట్టాలని నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా గిరిజన గ్రామస్తులతోపాటు సిపిఎం నాయకులు అప్పలరాజు ఆకులు కట్టుకుని వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన కనీస కోర్కెలు తీర్చాలంటూ పెద్ద సంఖ్యలో మహిళలు శిబిరంలో కూర్చుని నినాదాలు చేశారు, రిలేనిరాహార దీక్ష చేస్తున్న గిరిజనులను ఎంపిడిఒ కాశీ విశ్వనాథరావు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ తమ న్యాయమైన కోరికలు తీర్చాలంటూ గిరిజనులు చేస్తున్న దీక్ష ఐదవ రోజుకు చేరినా, అధికారులు నాయకులు ఎవరు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు, గిరిజన సంఘ నాయకులు కొండబాబు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణం లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రోడ్డు నిర్మాణం చేపట్టి పాఠశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు, కార్యక్రమంలో సిపిఎం నాయకులు డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

రెండో వార్డులో గడపగడపకూ...



ఎమ్మెల్యే గణేష్‌ను ఘనంగా స్వాగతిస్తున్న మహిళలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని రెండవ వార్డులో గడపగడప కార్యక్రమంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పాల్గొన్నారు. మహిళలు హారతులు పట్టి ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని మహిళలు ఎమ్మెల్యే గణేష్‌ను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు రోడ్లు, కల్వర్టు కావాలని కోరగా, వాటి మంజూరుకు ఎమ్మెల్యే గణేష్ హామీ ఇచ్చారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరిచండంతోపాటు ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ చైర్పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, వార్డు కౌన్సిలర్ శిరసపల్లి నాని, మున్సిపల్ కమిషనర్ కనకారావు తహశీల్దార్ అన్నాజీరావు, టౌన్ ఎస్ఐ గోవిందరావు పాల్గొన్నారు

పవన్‌ను విమర్శించడం తప్ప మంత్రి అమర్‌కు వేరే పని లేదా?

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు జనసేనాని పవన్ కల్యాణ్‌ను విమర్శించడం తప్ప, ప్రజా సమస్యలను పట్టించుకునే పనిలేదని జనసేన నర్సీపట్నం. నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజాన వీర సూర్యచంద్ర ఘాటుగా విమర్శించారు. మంగళవారం మాట్లాడుతూ పవన్ కల్యాణ్‌పై మంత్రి అమర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రానికి ఐటి శాఖా మంత్రిగా ఉండి ప్రజలకు ఏం చేశావో చెప్పాలన్నారు. ఉద్యోగాలు, ఉపాధి లేక యువత రాష్ట్రాన్ని వీడి వలస పోతుంటే పరిశ్రమలను నెలకొల్పి వాటిని నియంత్రించాల్సింది పోయి, మీడియా సమావేశాల్లో విపక్షనేతలు, పవన్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నావా అని మండిపడ్డారు. కార్యక్రమంలో అద్దేపల్లి గణేష్, గండెం దొరబాబు, రేగుబళ్ల శివ, వెలగల వెంకటరమణ, వాసం వెంకటేష్, కర్రి సంతోష్, ఠాగూర్, బాలకుమారి పాల్గొన్నారు

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

నాలుగురోజులుగా నిలిచిన నీటి సరఫరాపై ఖాళీ బిందెలతో ధర్నా

అవస్థలు పడుతున్నా పట్టించుకోరేం : ఫ్లోరైడ్ పీడిత గ్రామాల ప్రజల ఆవేదన



ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి-రోలుగుంట :ఫ్లోరైడ్ గ్రామాలకు మంచినీరు సౌకర్యం కల్పించాలని, నాలుగు రోజులుగా కుళాయి నీరు రావడం లేదంటూ ఖాళీ బిందెలతో రోడ్డుపై మహిళలు ఆందోళన, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గసభ్యులు కె.గోవిందరావు మాట్లాడుతూ మండల కేంద్రంతో పాటు కొవ్వూరు, నాయుడుపాలెం, అంట్లపాలెం, నిండుగొండ, ఎన్.కొత్తూరు, కిలపర్తిపాలెం, గొల్లపేట, మునిపెల్లిలను ఫ్లోరైడ్ గ్రామాలుగా ప్రభుత్వం 2007లో గుర్తించిందన్నారు. జానకిరాంపురం వరాహనది నుంచి బోరు పంపింగ్ ద్వారా రోలుగుంటలో లక్షలీటర్ల సామర్థ్యతో నిర్మించిన రక్షిత నీటి పథకం నుంచి ఆయా గ్రామాలకు నీరు సరఫరా చేస్తున్నారు. అయితే తరచూ ఈ పథకం మరమ్మతులు కావడంతో 18 వేల మంది జనాభా 9 గ్రామాల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఫ్లోరైడ్ నీరు తాగాల్సి వస్తుందన్నారు.ప్రజలు ఇంతగా ఇబ్బందులు పడుతున్నా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జగనన్నకు చెపుదాంలో జాయింట్ కలెక్టర్ ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. నల్లరాయి క్వారీలు కార్యకలాపాల వల్ల దుమ్ము ధూళితో పాటు ఫ్లోరైడ్ వాటర్ తాగడంతో తరచూ తొమ్మిది గ్రామాల ప్రజలు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. రూ.25 లక్షల వ్యయంతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసినా, దాన్ని ఉత్సవ విగ్రహంలా వినియోగంలోకి తేవడం లేదన్నారు తక్షణమే మంచినీటి సమస్య పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పి.దేవుడమ్మ, పి.అమ్మాజి, మహిళలు

పేదలకు సాగు పట్టాలు ఇవ్వాలని ధర్నా



తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న అప్పలరాజు

ప్రజాశక్తి-నక్కపల్లి : మండలంలో పేదల సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు డిమాండ్ చేశారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సాగుదారులతో కలిసి ధర్నా చేసారు. అనంతరం తహశీల్దార్ అంబేద్కర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎం.అప్పలరాజు, సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్ మాట్లాడుతూ మండలంలో దోసలపాడు, చీడిక, ముకుందరాజుపేట, నీలకుండీలు నర్సాపురం, గునిపూడి, బంగారమ్మపేట గ్రామాలలో అనేక ఏళ్లుగా పేదలు ప్రభుత్వ బంజరు భూములను అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి జీడి మామిడి తోటలు పెంచి, వచ్చిన ఫలసాయంతో కుటుంబాలను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు .సాగులో ఉన్న పేద రైతులకు డీ ఫారం పట్టాలు ఇవ్వకపోవడం చేత రైతు భరోసా, పి ఎం కిసాన్ వంటి పథకాలను పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలు సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో, దానికి అనుగుణంగా వీరికి పట్టాలు ఇవ్వాలని కోరారు. గతంలో పట్టాలు పొందిన వారికి ఆన్‌లైన్‌చేసి, 1బి, అడంగళ్‌లో నమోదు చేయకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందని పరిస్థితి ఉన్నందున ఆయా భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎం.నానాజీ, పి.రాజు, జి.అప్పారావు, కె.కొండబాబు, వి.రమణమ్మ పాల్గొన్నారు.

పచ్చి మేతతో అధిక పాల దిగుబడి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : పాడిపశువులకు పచ్చిమేత అందించటం వలన పశువులు ఆరోగ్యంగా ఉండి ఎదుగుదల బాగుంటుందని, సకాలంలో ఎదకు వచ్చి పాల దిగుబడి అధికంగా ఉంటుందని వెటర్నరీ ఎడి డాక్టర్ రాంబాబు అన్నారు. మంగళవారం ప్రాంతీయ పశు వైద్యశాలలో పశువిజ్ఞాన బడి నిర్వహించారు. పాడి రైతులకు గడ్డి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎడి రాంబాబు మాట్లాడుతూ ఏటా జూలై 7 నుండి 14 వరకు. పశుగ్రాస వారోత్సవాలు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా సబ్సిడీపై వివిధ రకాలైన జొన్న, మొక్కజొన్న, బొబ్బర్ల వంటి గడ్డి విత్తనాలను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. పాడి పశువుల కు రోజకు 25 కేజీల వరకూ పచ్చిమేత, ఎనిమిది కేజీలు ఎండుమేత అందించాలని సూచించారు. అలసంద, పిల్లిపెసర వంటి పప్పు జాతి మేతను పాడిపశువులకు అందిస్తే, పాలలో వెన్నశాతం పెరిగి రైతులకు అధిక లాభాలు వస్తాయిని సూచించారు. కార్యక్రములో డాక్టర్ పుష్ప , డాక్టర్ మోహన్, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ రమేష్, పాడిరైతులు పాల్గొన్నారు



మాడుగులలో పాడిరైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



గడ్డి విత్తనాల పంపిణీ చేస్తున్న ఎడి రాంబాబు

మాడుగుల : పశుగ్రాస వారోత్సవాలలో భాగంగా మంగళవారం మాడుగులలో పాడి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. . ఈ సందర్భంగా ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు చిట్టినాయుడు మాట్లాడుతూ కాకి జొన్న అలసందలు మొక్కజొన్న విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, అధిక పాల ఉత్పత్తికి పాడి పశువులకు పచ్చిమేత అందించాలని సూచించారు. ప్రధానపొలంలోనే కాకుండా గట్లుపైనా పశుగ్రాసాన్ని పెంచవచ్చున్నారు. కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ సౌజన్య ఇతర సిబ్బంది పాల్గొన్నారు

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంఎస్‌సి (ఆర్గానిక్ కెమిస్ట్రీ) బోధించుటకు గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. రాజు కోరారు. ఎంఎస్‌సి (ఆర్గానిక్ కెమిస్ట్రీ)లో 55 శాతం మార్కులతో పాసై ఉండి నెట్/ఎన్ఎస్ఈటీ/పిహెచ్‌డి అర్హత కలిగిన అభ్యర్థులు తమ బయోడేటాను సమర్పించి, ఈ నెల 15న కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

ఎంఇఒ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - రావికమతం : మండల విద్యాశాఖ అధికారిగా సిహెచ్ .తలుపులు మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. నర్సీపట్నం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన ఆయనను ప్రమోషన్‌పై రావికమతం ఎంఇఒగా నియమించారు. రావికమతం ఎంఇఒ జయలక్ష్మి చోడవరం బదిలీ కావడంతో, ఆ స్థానంలో కొత్త ఎంఇఒగా తలుపులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంఇఒ తలుపులును యుటిఎఫ్ మండల గౌరవ అధ్యక్షులు కే శ్రీనివాసరావు , అధ్యక్షులు పి.అప్పారావు, స్టేట్ కౌన్సిలర్ నాగేశ్వరావు, రమణమూర్తి, నీలకంఠం, యుటిఎఫ్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆరు నెలల వేతన బకాయి చెల్లించాలని

గురుకుల సిబ్బంది విధుల బహిష్కరణ



విధులు బహిష్కరించిన గురుకుల సెక్యూరిటీ సిబ్బంది

ప్రజాశక్తి-గొలుగొండ : ఆరు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ గొలుగొండ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది, స్విపర్‌కు మంగళవారం విధులకు బహిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు నెలల నుంచి జీతాలు ఇవ్వకపోతే ఏమి తిని బతకాలన్నారు. అర్ధాకలితో జీవనం సాగిస్తున్నామన్నారు. తక్షణమే తమకు రావాల్సిన జీతాలను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

సమస్యల పరిష్కారానికి అంగన్వాడీల రాస్తారోకో



మానవహారంగా ఏర్పడిన అంగన్వాడీలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద అంగన్వాడి అసోసియేషన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో అబీద్‌సెంటర్‌లో రాస్తారోకో, మానవహారాన్ని చేపట్టారు. ప్లకార్డులు పట్టుకుని, నినాదాలు చేపట్టారు. ఎఐటియుసి రాష్ట్ర సీనియర్ నేత జెవి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలపై ప్రభుత్వం సరైన రీతిలో స్పందించకపోతే రాష్ట్ర సచివాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. మూడేళ్లుగా టిఎ, డిఎ బిల్లులు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి అంగన్వాడీ కేంద్రాలను నెట్టుకు రావలసిన దుస్థితి నెలకొందన్నారు. ఏ నెలా ఒకటో తేదీకి జీతాలు అందే పరిస్థితి లేదన్నారు. అంగన్వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఇతర సౌకర్యాలను కల్పించాలని కోరారు.కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం అప్పలరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు రొంగల సత్య, వరలక్ష్మి, ఆశాజ్యోతి, కృష్ణవేణి, నవర మణి, చిన్నారి, రొంగలపాలెం సత్య పాల్గొన్నారు.